

ములకలచెరువు మార్కెట్ యార్డు ఎదురుగా తారు వేస్తున్న దృశ్యం



సీఎం వస్తున్నారని..

- గతంలో నత్తను తలపించిన పనుల్లో వేగం
- నేడు ఊపందుకున్న జాతీయ రహదారి విస్తరణ పనులు

ములకలచెరువు, మార్చి 31: ఇన్నాళ్లు నత్తను తలపించిన ముంబాయి-చెన్నై జాతీయ రహదారి విస్తరణ పనులు రెండు రోజుల నుంచి ఊపందుకున్నాయి. ములకలచెరువులో ఏప్రిల్ 2వ తేదీ సీఎం జగన్ రోడ్‌షో జరగనున్న నేపథ్యంలో రోడ్డు పనులు చకచకా చేస్తున్నారు. ఇష్టానుసారంగా చేపట్టిన జాతీయ రహదారి విస్తరణ పనులతో ఇన్ని రోజులు ప్రజలకు చుక్కలు కనిపించాయి. ములకలచెరువు నుంచి మదనపల్లె వరకు ఉన్న 43 కిలోమీటర్ల ముంబాయి-చెన్నై జాతీయ రహదారి (ఎస్‌హెచ్-42) విస్తరణ పనులకు కేంద్రం ప్రభుత్వం 2021 డిసెంబరులో రూ.480.10 కోట్లు మంజూరు చేసింది. దీనికి సంబంధించి టెండర్ల ప్రక్రియ తదితర పనులు పూర్తయి 2022 డిసెంబరులో పనులు ప్రారంభమయ్యాయి. అప్పట్లో శ్రీసత్యసాయి-అన్నమయ్య జిల్లా సరిహద్దులో ఈ పనులను ప్రారంభించారు. ఈ క్రమంలో ములకలచెరువును వదిలి మిగిలిన మదనపల్లె వరకు పనులు ప్రారంభించడంతో తుది దశకు చేరుకున్నాయి. చివరగా ములకలచెరువులో పనులు మొదలుపెట్టారు. 2023 డిసెంబరు చివరలో ఇక్కడ పనులు ప్రారంభించారు. సుమారు రెండు కిలోమీటర్ల రోడ్డు విస్తరణ, ఇరువైపులా మురికి నీటి కాలువల నిర్మాణం చేపట్టారు. మూడు నెలలుగా పనులు జరుగుతూనే ఉన్నాయి. నత్తలే నయం అన్న చందంగా పనులు జరుగుతున్నాయన్న విమర్శలు వినిపించాయి. దీనికి తోడు రోడ్డు కిరువైపులా మురికినీటి కాలువల నిర్మాణానికి తీసిన గుంతల కారణంగా నిత్యం వాహనాలు రాకపోకలు సాగించే ఈ మార్గంలో లేస్తున్న దుమ్ము, ధూళి, రోడ్డుపై ప్రవహిస్తున్న మురికినీటితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే రోడ్డుకు ఇరువైపులా మురికినీటి కాలువల నిర్మాణానికి ఇష్టానుసారంగా తీసిన గుంతల కారణంగా స్థానికులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. రోడ్డుకు ఆనుకుని ఇళ్ల ముందు తీసిన గుంతల కారణంగా ప్రజలు బయటకు రావడానికి వీలు లేకుండాపోయింది. దీంతో రాకపోకలు సాగించడానికి పొడవు పాటి చెక్కలు, కమ్మీలు ఏర్పాటు చేసుకున్నారు. రోడ్డుకిరువైపులా ఉన్న దుకాణదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ తరుణంలో సీఎం జగన్ ములకలచెరువు మీదుగా రోడ్‌షో నిర్వహిస్తుండడంతో పనులను ముమ్మరం చేశారు. ఇన్నాళ్లు ప్రజల అవస్థలు పట్టకపోయినా సీఎం జగన్‌పై మాత్రం ఎనలేని ప్రేమ వచ్చింది. జగన్ వస్తున్నాడని పనులు వేగం పెరగడంతో ములకలచెరువులో చర్చనీయాంశమైంది.



ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో డ్రైనేజి పనులు చేస్తున్న దృశ్యం

ఇంకెప్పుడిస్తారో..!

- 2020లో నీళ్లు తోలారు... బిల్లులు రాలేదు
- జగనన్నపై సొంత పార్టీ నాయకుల ఆగ్రహం
- కడుపు మండి ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయాలకు తాళం
- జిల్లా వ్యాప్తంగా బకాయిలు రూ.13 కోట్లు?

ప్రజలు నీటి సమస్యతో ఇబ్బందులు పడుతుంటే తమ ప్రభుత్వమే కదా ఉండేది డబ్బులు వస్తాయన్న ఆశతో అధికారుల హామీ మేరకు వైసీపీ నాయకులు ట్యాంకర్ల ద్వారా ప్రజలకు నీటిని సరఫరా చేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత 2020 సంవత్సరంలో నీటి ఎద్దడి ఎక్కువగా ఉన్న గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేశారు. ఇది చేసిందంతా కూడా వైసీపీ నాయకులే. తమ ప్రభుత్వమే కదా అధికారంలో ఉందని, బిల్లులు వస్తాయన్న ఆశ పెట్టుకున్న వారి ఆశలు అడియాశలుగానే మారాయి. ఐదేళ్లయినా వారికి బిల్లులు మాత్రం రాలేదు. అధికారులు, వైసీపీ నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా వారి గోడు ఎవరూ పట్టించుకోకపోవడంతో పలు చోట్ల ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయాలకు తాళాలు వేసి తమ నిరసనను తెలియచేశారు. జిల్లా వ్యాప్తంగా ఇలా దాదాపు రూ.13 కోట్ల మేరకు బకాయిలు ఉన్నట్లు తెలుస్తోంది.





వాల్మీకిపురం ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయానికి తాళం వేస్తున్న ఉప సర్పంచ్ ద్వారకనాథరెడ్డి (ఫైల్)



మదనపల్లెలో ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయానికి తాళం వేస్తున్న కాంట్రాక్టర్లు (ఫైల్)

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వం ఏర్పడిన 2019-20లో జిల్లా వ్యాప్తంగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉండడంతో పలు గ్రామాలు, మున్సిపాలిటీల్లో పలువురు అధికార పార్టీ నాయకులు ట్యాంకర్ల ద్వారా ప్రజలకు నీళ్లు సరఫరా చేశారు. ఇందుకు గాను గ్రామీణ రక్షిత మంచినీటి సరఫరా అధికారులు గ్రామాల్లో రైతుల వ్యవసాయ బోర్లను లీజుకు తీసుకుని కాంట్రాక్టర్ల ద్వారా ట్యాంకర్లతో నీళ్లు సరఫరా చేశారు. నీటి సమస్య తీవ్రంగా ఉన్న మండలాల్లో ఒక్కో మండలానికి సుమారు 40మంది కాంట్రాక్టర్లు చొప్పున జిల్లా వ్యాప్తంగా వేల మంది నీళ్లు సరఫరా చేశారు. దీనికి సంబంధించి జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.13 కోట్లకుపైనే కాంట్రాక్టర్లకు ప్రభుత్వం బిల్లులు బకాయి పడింది. అప్పటి నుంచి బిల్లుల కోసం కాంట్రాక్టర్లు ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. అయినా ఫలితం దక్కలేదు. దీంతో పలువురు కాంట్రాక్టర్లు కోర్టు మెట్లు కూడా ఎక్కారు. అయినా బిల్లులు పడలేదు. ఇంతలోనే జగనన్న ప్రభుత్వ కాలం కూడా అయిపోయింది. దీంతో నీళ్లు సరఫరా చేసిన అధికార పార్టీకి చెందిన నాయకులు తమ కడుపు మండి ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయాలకు తాళాలు వేస్తున్నారు. ఇక తమకు రావాల్సిన బిల్లులు ఎవరిస్తారని ఆవేదనతో ప్రశ్నిస్తున్నారు.

2019-20 జిల్లా వ్యాప్తంగా పలు మండలాలు, మున్సిపాలిటీలలో తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. దీంతో గ్రామీణ రక్షిత మంచినీటి సరఫరా శాఖ ప్రజలకు తాత్కాలికంగా నీటి సరఫరా చేసి సమస్యను పరిష్కరించాలని చూసింది. ఇందులో భాగంగా అందుబాటులో ఉన్న గ్రామాల్లో రైతుల బోర్లను లీజుకు తీసుకుంది. ఆ బోర్ల నుంచి నీటిని ట్యాంకర్ల ద్వారా ప్రజలకు సరఫరా చేసింది. ఇందుకు గానూ ఒక్కో మండలానికి 40 మంది కాంట్రాక్టర్లకు అవకాశం ఇచ్చింది. వీళ్లంతా తమ సొంత ఖర్చులతో నీటిని ప్రజలకు అందించారు. అయితే తర్వాత ప్రభుత్వం నుంచి కాంట్రాక్టర్లకు బిల్లులు రాలేదు. ఇలా జిల్లా వ్యాప్తంగా రూ.13 కోట్లకుపైనే బకాయిలు ఉన్నట్లు సమాచారం. ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్లలో నీళ్లు తోలినా ప్రభుత్వ కాలం ముగిసినా బిల్లులు రాకపోవడంతో నీళ్లు సరఫరా చేసిన పలువురు కాంట్రాక్టర్లు ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయాలకు తాళాలు వేసి తమ నిరసన తెలుపుతున్నారు. నెల రోజులుగా మదనపల్లె ఆర్‌డబ్ల్యూఎస్ డివిజన్ పరిధిలో వాల్మీకిపురం, గుర్రంకొండ, ములకలచెరువు ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయాలకు కాంట్రాక్టర్లు తాళాలు వేశారు. రాష్ట్ర ప్రభుత్వంపైన నమ్మకంతో నీళ్లు సరఫరా చేసి ఆ బిల్లులు రాక అప్పుల పాలయ్యామని కాంట్రాక్టర్లు ఆవేదన చెందుతున్నారు. భవిష్యత్తులో ఎవరైనా నీళ్లు తోలడానికి ముందుకొస్తారా అని వాపోతున్నారు.

కడుపు మండి కార్యాలయాలకు తాళాలు

మదనపల్లి ఆర్‌డబ్ల్యూఎస్ డివిజన్ పరిధిలోని మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గంలోని 15 మండలాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు 600 ట్యాంకర్లతో నీళ్లు సరఫరా చేశారు. దీనికి సంబంధించి ప్రభుత్వం కాంట్రాక్టర్లకు రూ.9 కోట్లు బకాయిలు పడింది. ఇందులో ఒక్క మదనపల్లె మున్సిపాలిటీ పరిధిలో ట్యాంకర్లతో నీటిని సరఫరా చేసిన వారికి రూ.4 కోట్లు బిల్లులు బకాయిలు ఉన్నట్లు తెలిసింది. రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాలలో సుమారు 170 మంది కాంట్రాక్టర్లకు రూ.4 కోట్లకుపైనే బిల్లులు రాలేదు. ఈ క్రమంలో తమ బిల్లులు చెల్లించాలని కాంట్రాక్టర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. దీనికి సంబంధించి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఒకసారి కాంట్రాక్టర్లు చెల్లించాల్సిన బిల్లులను ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేశారు. అయితే ఎందుకనో ప్రభుత్వం వీటిని రిజెక్ట్ చేసింది. కేవలం ప్రకాశం జిల్లా, చిత్తూరు జిల్లాలోని కుప్పం ఆర్‌డబ్ల్యూఎస్ డివిజన్లకు మాత్రమే కాంట్రాక్టర్లకు బిల్లులు అయినట్లు సమాచారం. దీనిపై కాంట్రాక్టర్లు హైకోర్టులో కేసు వేసినట్లు సమాచారం. బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు నెల రోజుల వ్యవధిలో వాల్మీకిపురం మండలం చింతపర్తి, మదనపల్లె, గుర్రంకొండ, ములకలచెరువు ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయాలకు తాళాలు వేసి తమ నిరసనను తెలిపారు. వాల్మీకిపురం మండలం చింతపర్తి గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ వైసీపీ నాయకుడు ద్వారకనాథరెడ్డి స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో తనకు రావాల్సిన బిల్లుల విషయమై అధికారులతో మాట్లాడారు. అతనికి సరైన సమాచారాన్ని అధికారులు ఇవ్వలేదు. దీంతో తనకు అన్యాయం జరుగుతోందని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయానికి తాళం వేశారు. ద్వారకనాథరెడ్డి మాట్లాడుతూ తాను 2020 నుంచి చింతపర్తి, మద్దెలచెరువు పల్లెలకు ట్యాంకుల ద్వారా ప్రజలకు తాగునీటి సరఫరా చేశానని, తనకు రూ.3 లక్షలు బిల్లు రావాలన్నారు. తాము నిజాయితీగా చేసిన పనులకు కూడా బిల్లులు చెయ్యకపోవడం పట్ల విచారం వ్యక్తం చేశాడు. మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో తాగునీటి సరఫరా చేసిన కాంట్రాక్టర్లు అందరూ వైసీపీకి చెందిన వారే ఉన్నారు. అందరికీ కలిపి సుమారుగా రూ.60 లక్షలకుపైగా బకాయిలు ఉన్నట్లు తెలిసింది. ఇదేవిధంగా ఇప్పటికి మదనపల్లె, గుర్రంకొండ, ములకలచెరువు ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయాలకు కాంట్రాక్టర్లు తాళాలు వేశారు. ఎన్నికల కోడ్ రాకముందే ప్రభుత్వం ఏమైనా సాయం చేస్తుందేమోనని ఆశతో కాంట్రాక్టర్లు తాళాలు వేశారు. అయినా బిల్లులు రాలేదు. ఎన్నికల కోడ్ వచ్చేసింది.

నిధులు రాగానే చెల్లింపులు..

వాల్మీకిపురం మండలంలోని గ్రామాల్లో తాగునీటి సరఫరాకు సంబంధించి కాంట్రాక్టర్ల బిల్లులన్నీ ఆన్‌లైన్‌లో పెట్టాము. ప్రభుత్వం నుంచి నిధులు రాగానే కాంట్రాక్టర్లకు చెల్లిస్తాము.

- మిధున్ చక్రవర్తి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

ములకలచెరువులో ఎస్పీ తనిఖీలు

- సీఎం జగన్ బస చేసే స్థలం, రోడ్‌షో జరిగే మార్గం పరిశీలన

ములకలచెరువు, మార్చి 31: ములకలచెరువులో ఆదివారం ఎస్పీ కృష్ణారావు తనిఖీలు చేపట్టారు. ఏప్రిల్ 2వ తేదీ సీఎం జగన్ బస చేసే స్థలం, రోడ్‌షో జరిగే మార్గాన్ని పరిశీలించారు. సీఎం జగన్ చేపట్టిన బస్సు యాత్ర సోమవారం రాత్రి శ్రీసత్యసాయి జిల్లా నుంచి అన్నమయ్య జిల్లాలోకి ప్రవేశించనుంది. ఈ క్రమంలో జిల్లా సరిహద్దులోని పాత ములకలచెరువుకు వెళ్లే రోడ్డు పక్కన సీఎం జగన్ రాత్రి బస చేయనున్నారు. అనంతరం మంగళవారం ఉదయం ములకలచెరువు మీదుగా రోడ్‌షో నిర్వహించనున్నారు. అనంతరం మదనపల్లెలో జరిగే మేమంతా సిద్ధం సభకు హాజరవుతారు. దీంతో భద్రతా ఏర్పాట్ల దృష్ట్యా జగన్ రాత్రి బస చేసే ప్రాంతాన్ని, రోడ్‌షో జరిగే మార్గాన్ని ఎస్పీ పరిశీలించారు. ఆయన వెంట అడిషనల్ ఎస్పీ రాజ్‌కమల్, మదనపల్లె డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, ట్రైనీ డీఎస్పీ ప్రశాంత్, సీఐ మధు, ఎస్‌ఐ తిప్పేస్వామి తదితరులు ఉన్నారు.



ములకలచెరువు వద్ద సీఎం బస చేసే స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ కృష్ణారావు

ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలి

- సీపీవోకు ఏపీటీఎఫ్ వినతి

కడప (ఎడ్యుకేషన్), మార్చి 31: సార్వత్రిక ఎన్నికల విధుల నుంచి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులైన ఉపాధ్యాయులను, చంటిబిడ్డల తల్లులను, దివ్యాంగ ఉపాధ్యాయులకు మినహాయింపునివ్వాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్యాంసుందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం కలెక్టరేట్ ముఖ్య ప్రణాళిక అధికారికి ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి తీవ్రత దృష్ట్యా 60 ఏళ్లు దాటిన ఉపాధ్యాయులను కూడా ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. రిసెప్షన్ సెంటర్లు, పోలింగ్ కేంద్రాల్లో మెరుగైన వసతులు కల్పించాలని కోరారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖాదర్‌బాషా, శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర నాయకులు గుంగలయ్య, జిల్లా నాయకులు నరసింహారెడ్డి, రామ సుధాకర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, నరసింహులు, మస్తాన్, బాబు, శ్రీనివాసులు పాల్గొన్నారు.



సీపీవోకు వినతిపత్రం అందిస్తున్న ఏపీటీఎఫ్ ప్రతినిధులు

ఎన్నికల ప్రచారంలో సంఘమిత్రలు



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సంఘమిత్రలు భాస్కర, విశ్వనాథ

పీలేరు, మార్చి 31: పీలేరు నియోజకవర్గం గుర్రంకొండ మండలంలో ఆదివారం జరిగిన వైసీపీ ఎన్నికల ప్రచారంలో ఆ మండలంలో సంఘమిత్రలుగా పనిచేస్తున్న ఇద్దరు పాల్గొనడం చర్చనీయాంశమైంది. గుర్రంకొండ మండలంలో భాస్కర, విశ్వనాథ సంఘమిత్రలుగా పనిచేస్తున్నారు. ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తనయుడు చింతల సాయికృష్ణారెడ్డి ఆదివారం గుర్రంకొండ మండలం మర్రిపాడులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆ ప్రచారంలో పాల్గొన్న భాస్కర, విశ్వనాథ వైసీపీకి ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. ఎన్నికల సంఘం పలుమార్లు హెచ్చరించినప్పటికీ బేఖాతరు చేస్తూ వారు ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం విశేషం.

రీలర్ల సిండికేట్

- ఈ-మార్కెటింగ్‌లో లొసుగులు
- పట్టు రైతులకు అందని గిట్టుబాటు ధరలు



మదనపల్లెలోని ప్రభుత్వ పట్టుగూళ్ల విక్రయ కేంద్రం

మదనపల్లె టౌన్, మార్చి 31: రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరలు నిర్ణయించి, రైతులను ఆదుకునేందుకు దేశవ్యాప్తంగా అమలు చేస్తున్న ఈ-మార్కెటింగ్‌లో లొసుగుల కారణంగా రైతులకు గిట్టుబాటు ధరలు దక్కడం లేదు. ఓపెన్ మార్కెట్‌లో వ్యాపారులు ఎలా సిండికేట్ అవుతారో.. ఈ-మార్కెట్‌లోని లొసుగులతో ఇక్కడ కూడా వ్యాపారులు సిండికేట్ అవుతున్నారు. దీంతో రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు రాక తీవ్రంగా నష్టపోతున్నారు. మదనపల్లె పట్టుగూళ్ల మార్కెట్‌లో ఈ-మార్కెటింగ్‌తో రైతులకు లాభాలు కనపడటం లేదు. మదనపల్లె పట్టుగూళ్ల మార్కెట్ అన్నమయ్య జిల్లాలోనే అతి పెద్ద పట్టుగూళ్ల మార్కెట్‌గా వెలుగొందుతోంది. రాష్ట్రంలో మదనపల్లె, పలమనేరు, కుప్పం, హిందూపురం, హనుమాన్ జంక్షన్‌లో ప్రభుత్వ పట్టుగూళ్ల మార్కెట్‌లు ఉన్నాయి. వీటితో పాటు కర్ణాటకలోని చిక్‌బళ్లాపూర్, కోలారు ప్రాంతాల్లో కూడా పట్టుగూళ్ల మార్కెట్‌లు ఉన్నాయి. ఒకప్పుడు నిత్యం మదనపల్లె మార్కెట్‌కు 5 వేల కిలోల వరకు గూళ్లు విక్రయానికి వచ్చేవి. క్రమేపీ రైతులు మదనపల్లెకు పట్టుగూళ్లు తీసుకొచ్చేందుకు ముందుకు రాకుండా కర్ణాటక మార్కెట్ వైపు చూస్తున్నారు. దీంతో వారంలో ఒకటి లేదా రెండు రోజులు మాత్రమే 1000 నుంచి 2 వేల కిలోల గూళ్లు విక్రయానికి వస్తున్నాయి. అది కూడా కృష్ణ, చేబ్రోలు ప్రాంతాల నుంచి పట్టురైతులు గూళ్లు తీసుకుని మదనపల్లె మార్కెట్‌కు వస్తున్నారు.

అందని గిట్టుబాటు ధరలు..

ఈ-మార్కెట్‌లో లొసుగులు

వాతావరణంలో తేమశాతం ఆధారంగా పట్టుగూళ్ల నాణ్యత పెరిగి, వ్యాపారుల మధ్య పోటీ ఉంటేనే రైతుకు గిట్టుబాటు ధరలతో పాటు అధికంగా ధరలు పలికి లాభాలు వస్తాయి. మదనపల్లె మార్కెట్‌కు గతంలో క్రాస్‌బ్రీడ్ (సీబీ) రకం గూళ్లు ఎక్కువగా వచ్చేవి. కానీ నాలుగేళ్లుగా సీబీ రకం గూళ్ల పెంపకం బదులు రైతులు బైవోల్టీన్ గూళ్ల ఉత్పత్తి చేస్తున్నారు. ప్రస్తుతం బైవోల్టీన్ రకం గూళ్లకే గిరాకీ ఉందని చెప్పవచ్చు. మదనపల్లె మార్కెట్‌కు గతేడాదితో పోలిస్తే ఈసారి సీజన్‌లో రెట్టింపుగా పట్టుగూళ్లు విక్రయానికి వస్తున్నాయి.. గతేడాది ఫిబ్రవరిలో 6500 కిలోల గూళ్లు విక్రయానికి వస్తే ఈ ఏడాది ఫిబ్రవరిలో 13 వేల కిలోల గూళ్లు విక్రయానికి వచ్చాయి. కాగా మదనపల్లె ప్రాంతంలో మల్బరీ సాగు గణనీయంగా తగ్గినా, కృష్ణా జిల్లా చేబ్రోలు ప్రాంతాల నుంచి పట్టు రైతులు పండించిన గూళ్లను మదనపల్లె మార్కెట్‌కు తీసుకువస్తున్నారు.

తిరకాసు ఇక్కడే..

సాధారణంగా మదనపల్లె మార్కెట్‌కు వారంలో రెండు రోజులు మాత్రమే పెద్ద సంఖ్యలో గూళ్లు విక్రయానికి వస్తాయి. మిగిలిన రోజుల్లో కేవలం 100 నుంచి 500 కిలోల గూళ్లు మాత్రమే విక్రయానికి వస్తాయి. ఈ సందర్భంగా రీలర్లు ఈ-మార్కెట్ విధానంలో ఎక్కువ ధరలు కోట్ చేస్తారు. దీంతో మదనపల్లె మార్కెట్‌లో ఎక్కువ ధరలు పలుకుతున్నాయని దూర ప్రాంత రైతులు ఎక్కువ గూళ్లను మదనపల్లెకు తీసుకొస్తారు. అప్పుడే పట్టు రీలర్లు (గూళ్ల వ్యాపారులు) తమ చేతివాటం ప్రదర్శిస్తారు. ఉదయం 11 గంటలకు ఈ-మార్కెటింగ్ ప్రారంభం కాగానే 10 నిమిషాల వ్యవధిలో రీలర్లు వారికి నచ్చిన లాట్ (50 కిలోల గూళ్ల ట్రే) వారికి ఇష్టమైన ధరలు కోట్ చేయాలి. కానీ రీలర్లు అందరూ 9 నిమిషాలు చర్చించుకుని కాలం వెళ్లదీస్తారు. చివరి నిమిషంలో హడావుడిగా ధరలు కోట్ చేస్తారు. కిలో రూ.500 ధర పోవాల్సిన గూళ్లను సరాసరిన కిలో రూ.339 మాత్రమే వచ్చేలా ధరలు కోట్ చేస్తారు. ఒకవేళ రైతుకు ఈ ధరలు సమ్మతం కాకుంటే రెండో, మూడో యాక్షన్ వేయాలని కోరతారు. అప్పటికే సిండికేట్ అయిన రీలర్లు అంతకు ముందు పాడిన ధరల కంటే ఇంకా కిలోకు రూ.10 నుంచి రూ.15 తగ్గించి కోట్ చేస్తారు. దీంతో గత్యంతరం లేని రైతు మొదటి యాక్షన్ ధర అయినా ఇమ్మని రాజీకి వస్తాడు. దీంతో కిలో సరాసరిన రూ.400 నుంచి రూ.450 పోవాల్సిన గూళ్ల ధర రూ.100 తగ్గిపోయి రైతు నష్టాలను చవిచూస్తున్నాడు.

ఈ-మార్కెటింగ్‌లో లొసుగులు

సాధారంగా దేశవ్యాప్తంగా బంగారుకు ఎలా నిత్యం ధరలు ఎలా నిర్ణయిస్తారో, అలాగే పట్టుగూళ్లకు కూడా సెంట్రల్ సిల్క్ బోర్డు నుంచి కనీస మద్దతు ధర ప్రకటించాల్సి ఉంది. దేశవ్యాప్తంగా ఈ ధరను ఈ-మార్కెటింగ్‌లో పొందుపరచాల్సి ఉంది. కానీ ఇవేమి అమలు కావడం లేదు. ఉదాహరణకు సెంట్రల్ సిల్క్ బోర్డు నుంచి కనీస మద్దతు ధర కిలోకు రూ.400 పెట్టారనుకుంటే గూళ్ల నాణ్యతను బట్టి ఈ ధర పెరుగుతూనే ఉంటుంది. కానీ ఎక్కడా ఈ విధానం అమలు కావడం లేదు.

గిట్టుబాబు ధర కల్పించాలంటే..

దిద్దుబాటుకు ఆస్కారం

పట్టుగూళ్ల ఈ-మార్కెట్ విధానంలో కొన్ని సవరణలు, మార్పులు చేయాల్సి ఉందని రైతులు అంటున్నారు. ఈ-మార్కెట్‌లో తొలి యాక్షన్ పాడేందుకు కేటాయించిన 10 నిమిషాల్లో ప్రతి రెండు నిమిషాలకు రైతుల గూళ్లకు ఏదో ఒక ధర కోట్ చేయాలి. ఇలా ఐదుసార్లు ధర పెంచుకుంటూపోతే రైతుకు మంచి ధర వస్తుంది. రీలర్ పాడిన ధరలను తిరిగి తగ్గించకుండా లాక్ పెట్టాల్సి ఉంది. అలాగే సెంట్రల్ సిల్క్ బోర్డు ప్రతిరోజూ రైతుకు మద్దతు ధరను ప్రకటించాలి. రీలర్లు పట్టుగూళ్లను ఈ ధర కంటే తక్కువకు కోట్ చేయకుండా ఈ-మార్కెట్‌లో సవరణలు చేయాలి. ఇలా కాని పక్షంలో ఈ-మార్కెట్ యాప్ నిలిచిపోవాలి.

గూళ్ల నాణ్యతను బట్టి రైతుకు న్యాయం చేస్తాం..

మార్కెట్‌కు రైతు తీసుకొచ్చే పట్టుగూళ్ల నాణ్యతను బట్టి రైతుకు గిట్టుబాటు ధరలు వచ్చేలా చర్యలు చేపడతాం. గూళ్ల నాణ్యతను చూసే విధానంలో రీలర్లకు ఎంత అనుభవం ఉంటుందో, అదేవిధంగా తమకు గూళ్ల నాణ్యత లెక్కించే శిక్షణ తీసుకున్నాం. మూడు యాక్షన్లలో రీలర్ ఒకే ధర కోట్ చేస్తే రైతుతో పాటు, మేము యాక్షన్ రద్దు చేస్తాం. రైతు సమ్మతితో మరో యాక్షన్ వేయడం కాని, లేక వెనక్కి తీసుకెళ్లే అవకాశం కల్పిస్తాం. బలవంతంగా రైతుగూళ్లను యాక్షన్‌లో వదలము.

- లక్ష్మిదేవి, మార్కెటింగ్ ఆఫీసర్, ప్రభుత్వ పట్టుగూళ్ల విక్రయ కేంద్రం, మదనపల్లె

పట్టుగూళ్ల మార్కెట్‌లో ఈ-మార్కెటింగ్ విధానంలో మొబైల్ యాప్‌లలో ధరలు కోట్ చేస్తున్న రీలర్లు



నేటి నుంచి టెన్త్ మూల్యాంకనం

- ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యాశాఖ
- జిల్లాకు 192080 జవాబు పత్రాల కేటాయింపు
- విధుల్లో 902 మంది సిబ్బంది

కడప (ఎడ్యుకేషన్), మార్చి 31: పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకానికి జిల్లా విద్యాశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. సోమవారం నుంచి ఏప్రిల్ 8వ తేదీ వరకు కడప నగరం మున్సిపల్ హైస్కూలు మెయిన్‌లో నిర్వహించేందుకు అంతా సిద్ధం చేశారు. ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు సిబ్బంది విధుల్లో ఉంటారు. జిల్లాకు 192080 జవాబు పత్రాలు కేటాయించారు. ఇందులో తెలుగు 29392, హిందీ 22099, ఇంగ్లీషు 16610, గణితం 32936, ఫిజికల్ సైన్స్ 29550, బయాలజికల్ సైన్స్ 32403, సోషల్ స్టడీస్ 29090 జవాబు పత్రాలు కేటాయించారు. వీటిని మూల్యాంకనం చేసేందుకు వంద మంది చీఫ్ ఎగ్జామినర్లు, 602 మంది సహాయక ఎగ్జామినర్లు, 200 మంది స్పెషల్ అసిస్టెంట్లతో కలిపి మొత్తం 902 మంది సిబ్బందిని నియమించారు. ప్రతి గ్రూపులో ఒక చీఫ్ ఎగ్జామినర్, ఆరుగురు సహాయక ఎగ్జామినర్లు, ఇద్దరు స్పెషల్ అసి స్టెంట్లు ఉంటారు. ప్రతి సహాయక ఎగ్జామినరు రోజుకు 40 పేపర్లు మూల్యాంకనం చేయాల్సి ఉంది. మూల్యాంకనం చేస్తున్న తరుణంలో సెల్‌ఫోన్లు వినియోగించకూడదు. మూల్యాంకనం నిమిత్తం ఫర్నీచర్, విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాల కల్పిస్తూ విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది.

మూల్యాంకన విధుల్లో ఎవరికీ మినహాయింపు లేదు

మూల్యాంకనం నిర్వహణకు నియామకమైన సిబ్బంది ఖచ్చితంగా హాజరు కావాలని, ఇందులో ఎవరికీ మినహాయింపు లేదని పదో తరగతి పరీక్షల జిల్లా పర్యవేక్షణ అధికారి ఎంవీ క్రిష్ణారెడ్డి అన్నారు. ఆదివారం కడప నగరం మున్సిపల్ హైస్కూలు మెయిన్‌లో జరిగే స్పాట్ వాల్యు యేషన్‌పై డీఈవో, ఏసీఈతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి జిల్లాలో పదో తరగతి స్పాట్ వాల్యుయేషన్ జరుగుతుందని, దీనికి అవసరమయ్యే ఏర్పాట్లు చేయాలని సూచించారు. విధి నిర్వహణలో ఎటువంటి అలసత్వం ప్రదర్శించకుండా విధులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కట్టుదిట్టమైన భద్రత మధ్య మూల్యాంకనం పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఈవో అనురాధ, ఏసీఈ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మూల్యాంకన కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా పరిశీలకులు క్రిష్ణారెడ్డి, డీఈవో అనురాధ

విద్యుదాఘాతంతో వృద్ధుడి మృతి

ఓబులవారిపల్లె, మార్చి 31: విద్యుదాఘాతంతో ఓ వృద్ధుడు మృతి చెందిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇంట్లో ఒంటరిగా ఉండడంతో దుర్వాసన వచ్చేవరకూ ఎవరూ గుర్తించలేదు. మండలంలోని జీవీపురం గ్రామానికి చెందిన కొమ్మూరు జయరాయం రెడ్డి (68) ఒంటరిగా జీవిస్తున్నాడు. ఆదివారం ఆయన నివాసం ఉంటున్న ఇంటి నుంచి దుర్వాస వస్తున్న విషయం గమనించిన చుట్టుపక్కల ఇళ్ళవారు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఇంటిలోని సీలింగ్ ఫ్యాన్ కారణంగా విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు వారు నిర్ధారించారు. వైద్యులను పిలిపించి సంఘటన స్థలంలోనే పోస్టుమార్టం చేయించినట్లు ఎస్‌ఐ చిన్నపెద్దయ్య తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

కానిస్టేబుల్ ఆత్మహత్య

ప్రొద్దుటూరు క్రైం, మార్చి 31 : డ్రైవర్ కొట్టాలలో నివాసం ఉంటున్న బాలవాసు (35) అనే కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్నాడు. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బాలవాసు కలమల్ల పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్నాడు. 2023 డిసెంబరులో పులివెందులలోని నగరిగుట్ట వీధిలో తన భార్య జానకిని గొంతు నులిమి హత్య చేశాడు. ఈ కేసులో పులివెందుల పోలీసులు బాలవాసును అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. అతనిపై కేసు నమోదు కావడంతో పోలీసు ఉన్నతాధికారులు ఉద్యోగం నుంచి సస్పెండ్ చేశారు. రిమాండులో ఉన్న అతను వారం రోజుల క్రితం బెయిల్‌పై బయటికి వచ్చాడు. డ్రైవర్ కొట్టాలలోని తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్యను చంపాననే బాధతో రోజు అతను మదనపడే వాడని కుటుంబసభ్యులు తెలిపారు. ఈ క్రమంలోనే అతను ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు త్రీటౌన్ సీఐ వెంకటరమణ తెలిపారు.

ట్రిపుల్‌ఐటీ తాత్కాలిక ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలి



వైసీపీ నేతల సమావేశంలో పాల్గొన్న ట్రిపుల్‌ఐటీ తాత్కాలిక ఉద్యోగులు (వృత్తంలో)

వేంపల్లె, మార్చి 31: వైసీపీ కార్యక్రమాల్లో పాల్గొంటున్న ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో పనిచేసే తాత్కాలిక ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని టీడీపీ మండల కన్వీనర్ రామమునిరెడ్డి అధికారులను కోరారు. గతనెల 29వ తేదీన వైసీపీ నాయకులు వేంపల్లెలోని ఆ పార్టీ కార్యాలయంలో టీడీపీపై విమర్శలు చేసేందుకు ప్రెస్‌మీట్ ఏర్పాటు చేశారని, అందులో ట్రిపుల్ ఐటీలో పనిచేసే సెక్యూరిటీ గార్డు వలి, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి బ్రహ్మయ్య పాల్గొన్నారని పులివెందుల ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్న తాత్కాలిక ఉద్యోగుల ఫొటోలను టీడీపీ నాయకులు విలేకరులకు విడుదల చేశారు. దీనిపై ఎన్నికల నిబంధనల మేరకు ఉద్యోగులు పార్టీలకు పనిచేయకుండా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు విజ్ఞప్తి చేశారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

వాల్మీకిపురం, మార్చి 31: అనుమానాస్పదస్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం వాల్మీకిపురం మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని చింతపర్తి గ్రామ సమీప బాహుదా కాలువలో 41సంవత్సరాల వయసు గల ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆది వారం శవమై కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ నాగేశ్వర్‌రావ్ సం ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు ఆరా తీశారు. మృతదే హాన్ని ఒడ్డుకు చేర్చగా మృతుడు ఎరుపు రంగు టీషర్ట్, నీలం రంగు ఫుల్ డ్రాయర్ ధరించి ఉన్నాడని, అంతేకాక అతడి చేతి పైన రాములమ్మ, బాలరాజు అనే పేర్లు పచ్చబొట్టు కూడా ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. కాగా ఎవరైనా హతమార్చి మృతదేహాన్ని బాహుదా కాలువలో పడేసారా? లేక అతనే ఆత్మహత్యకు పాల్పడ్డాడా? అన్న అనుమానాలు పోలీసుల దర్యాప్తులో తెలిసే అవకాశం ఉంది.

రెడ్డెమ్మతల్లికి ప్రత్యేక పూజలు

గుర్రంకొండ, మార్చి 31:గుర్రంకొండ మండలం చెర్లోపల్లెలో కొలువైన రెడ్డెమ్మకొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయంలో అమ్మవారు సంతానలక్ష్మీగా ప్రసిద్ధి చెందారు. ఇందులో భాగంగా ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పరిమళభరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి అర్చకులు పూజలను చేశారు. అమ్మవారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి మహిళా భక్తులు వచ్చారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు మొక్కులు తీర్చుకోవడానికి రావడంతో ఆలయ పరిసరాలు రద్దీగా మారాయి.

వేగానికి ఏదీ కళ్లెం!



- పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు..
- బైక్ విన్యాసాలతో బెంబేలెత్తిస్తున్న యువత....

రైల్వేకోడూరు (రూరల్) మార్చి 31: అధునాతన ద్విచక్ర వాహనాలపై యువత జోరు ప్రజల గుండెల్లో రైళ్లను పరిగెట్టిస్తోంది. ద్విచక్ర వాహనాలను వేగంగా నడుపుతూ యువకులు చేస్తున్న విన్యాసాలు పట్టణ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. వింత హారన్లతో ప్రధాన రహదారుల్లోతో పాటు స్కూలు కాలేజీల వద్ద యువత దూకుడు స్థానికులను హడలెత్తిస్తోంది.

డ్రైవింగ్ లైసెన్సులు లేకుండానే..

ఓ రకమైన ఉన్మాదంతో వాహనాలు దూకుడుగా నడుపుతున్న యువకుల్లో చాలా మంది 15 ఏళ్ల వయసువారు కూడా ఉంటున్నారు. వీరిలో పలువురికి డ్రైవింగ్ లైసెన్సులు కూడా లేవు. వీరు 350, 500 సీసీ సామర్థ్యం ఉన్న బైకులను అధికంగా వాడుతున్నారు. ప్రమాదం జరిగినప్పుడు ఎదుటి వారి సంగతి పక్కనబెడితే కనీసం స్వీయ భద్రతా కోణాన్ని కూడా వీరు విస్మరిస్తున్నారు. కొందరు యువకులు మద్యం మత్తులో వాహనాలను నడుపుతుండడం ఆందోళనకు గురిచేస్తోంది. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూనే వాహనాలను పరుగులెత్తిస్తుండడంతో రోడ్లపై వెళ్లే సామాన్యులు భయపడుతున్నారు. ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతున్నా యువతలో మార్పు కనిపించడం లేదని పలువురు అంటున్నారు.

తస్మాత్ జాగ్రత్త

తల్లిదండ్రుల అతిప్రేమ యువత జోరుకు బ్రేకులు లేకుండా పోయాయి. రైల్వేకోడూరు మండలంలో చాలామంది ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లారు. పిల్లల కోరికలు తీర్చడానికి మార్కెట్లోకి వచ్చే కొత్త టెక్నాలజీ 350, 500 సీసీ వాహనాలు ప్రేమతో కొనిస్తున్నారు. అదే వాళ్ల పాలిట శాపంగా మారుతోందని గ్రహించలేకపోతున్నారు.

మైనర్లకు వాహనాలిస్తే జైలు



మైనర్లకు వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇస్తున్నాం. విపరీత వేగంతో దూసుకెళ్లే యువతపై కఠిన చర్యలు తీసుకుంటాం. కోడూరు పరిసర ప్రాంతంలో గల్ఫ్‌కు వెళ్లిన వాళ్లు చాలా ఎక్కువ. వీరు పిల్లల మీద ప్రేమతో కొత్త కొత్త బైకులను కొనిస్తున్నారు. వాళ్లకు లైసెన్సు ఉందో లేదో తెలియకుండా వాహనాలు ఇస్తున్నారు. ప్రమాదాలకు కారణం ఒకరకంగా తల్లిదండ్రులే. ముఖ్యంగా సెలవులు రావడంతో పిల్లలు ఎక్కువగా తల్లిదండ్రులకు తెలియకుండా బైక్‌పై షికార్ వెళ్తుంటారు. తల్లిదండ్రులు పిల్లలపై దృష్టి పెట్టాలి.

-టి.బాబు, సీఐ, రైల్వేకోడూరు

బెల్టుషాపుల జోరు షురూ!

- దాడులు చేస్తున్నా ఆగని అమ్మకాలు
- డంప్‌ల ఏర్పాటుకు నేతల ప్రయత్నాలు

పోరుమామిళ్ల, మార్చి 31 : ఎన్నికలు సమీపిస్తుండడంతో మండలంలో బెల్టుషాపులు జోరందుకున్నాయి కోడి కూయకముందే వీటిలో మద్యం అమ్మకాలు ప్రారంభమవుతున్నాయి. పోరుమామిళ్ల పట్టణంలో తెల్లవారుజామున 3 గంటలకే బెల్టుషాపులు తెరుచుకుంటున్నాయి. క్వార్టర్‌పై రూ.50 అదనంగా చెల్లించేందుకు మద్యంప్రియులు వెనుకాడకపోవడంతో ఈ వ్యాపారం కూడా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది.. సరిపోయినంత డబ్బు లేకపోతే ఇద్దరు నలుగురు కలిసి మద్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. పోరుమామిళ్లలోని వెంకటేశ్వర థియేటరుకు వెళ్లే దారిలో, పెట్రోలు బంకు సమీపంలో, రంపాడు వెళ్లే మార్గంతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో ఈ బెల్టుషాపులు నిర్వహిస్తున్నారు. పోలీసు అధికారులు దాడులు చేసి, హెచ్చరికలు జారీ చేసి, గ్రామసభలు నిర్వహించినా వీరిలో మాత్రం మార్పు కనిపించడం లేదు. కొన్ని గ్రామాల్లో మద్యం రహస్య ప్రాంతాల్లో నిలువ చేసి, అవసరాన్ని బట్టి విక్రయిస్తున్నారు. ర్యాలీలు, ప్రచారాల సమయంలో బెల్టుషాపుల నిర్వాహకులకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. ఆ సమయంలో డిమాండ్‌ను బట్టి క్వార్టర్‌పై 50 నుంచి 70 రూపాయలు అధికంగా విక్రయిస్తున్నట్లు సమాచారం. ఇటీవల పోలీసు అధికారులు, సీఐ చిరంజీవి, ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో దాడులు చేసి, కేసులు కూడా నమోదు చేశాడు. అయినా, క్వార్టర్‌పై 50 అదనంగా ఆదాయం వస్తుండడంతో పలువురు ఇదే ఉపాధిగా మలుచుకుంటున్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో ఏపార్టీ నాయకుడికి ఎంత అవసరమో అంత మద్యం డంప్ చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఎన్నికల సమయంలో బెల్టుషాపులను నియంత్రించకుంటే మద్యం ప్రియుల ఆగడాలు ఎక్కువయ్యే అవకాశాలున్నాయి. బెల్టు షాపులకు సంబంధించి 2022లో మండలంలో 16 కేసులు నమోదు కాగా 2023లో ఐదు కేసులు, 2024లో మూడు నెలల వ్యవధిలో 21 కేసులు నమోదయ్యాయి. ఎన్నికలు సమీపించే కొద్దీ పెరుగుతున్న బెల్టు వ్యవహారం శ్రుతిమించే అవకాశం ఉంది. పోలీసు, ఎక్సైజ్ అధికారులు గ్రామాలపై దృష్టి సారించి బెల్టుషాపులను కట్టడి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



మల్లకతవ చెక్‌పోస్టు వద్ద సీఐ స్వాధీనం చేసుకున్న మద్యం (ఫైల్)

బెల్టు షాపుల కట్టడికి కృషి

పోరుమామిళ్ల మండలంలో బెల్టుషాపుల నిర్మూలనకు కృషి చేస్తున్నామని ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. గ్రామాల్లో తనిఖీలు ముమ్మరం చేస్తున్నామని, గతంలో బెల్టుషాపులు నిర్వహించిన వారికి కౌన్సిలింగ్ ఇవ్వడంతో పాటు, గ్రామసభలు ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యవంతం చేస్తున్నామన్నారు. బెల్టుషాపుల నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

చిత్రలేఖనంతో విద్యార్థులకు మానసిక ఆనందం

చాపాడు, మార్చి 31: చిత్రలేఖనంతో విద్యార్థులు మానసిక ఆనందం పొందవచ్చని యోగివేమన విశ్వవిద్యాలయం చిత్రలేఖన విభాగాధిపతి మృత్యుంజయరావు అన్నారు. ఢిల్లీ ఇంటర్నేషనల్ పబ్లిక్ స్కూలులో ఆదివారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనస్సులోని భావాలను బొమ్మల రూపంలో గీసి వాటి ప్రతిరూపాలు పొందడమేనన్నారు. ఈ పోటీల్లో సీనియర్స్ విభాగంలో 7వ తరగతి విద్యార్థి జేష్ఠసాయికి మొదటి బహుమతి రూ.7 వేలు, 9వ తరగతి విద్యార్థి వెంకటకిశోర్‌కు రెండవ బహుమతి రూ.5 వేలు, తృతీయ బహుమతి 7వ తరగతి విద్యార్థి నిత్యశ్రీకి రూ.3 వేలు నగదు గెలుచుకున్నట్లు వారు తెలిపారు. జూనియర్స్ విభాగంలో 5వ తరగతి విద్యార్థి బృందసాయికి మొదటి బహుమతి రూ.5 వేలు, మనీషకు రెండవ బహుమతి రూ.3 వేలు, 6వ తరగతి విద్యార్థి నిత్యశ్రీ మూడవ బహుమతి రూ.1500 గెలుచుకున్నారు. సబ్ జూనియర్స్ విభాగం విద్యార్థులకు కూడా బహుమతులు పంపిణీ చేశారు. ఛైర్మన్ జయచంద్రారెడ్డి, ప్రిన్సిపాళ్లు శ్రీనివాసులరెడ్డి, రవీంద్రకుమార్, డైరెక్టర్ లోహిత్‌రెడ్డి కూడా మాట్లాడారు.



బహుమతులు పంపిణీ చేస్తున్న శ్రీనివాసులరెడ్డి

టమోటా పంటకు వినూత్న సంరక్షణ

- నీడ కోసం మెష్ ఏర్పాటు
- రైతన్నల వినూత్న ఆలోచన

పెద్దతిప్పసముద్రం మార్చి 31 : టమోటా రైతులు వినూత్న రీతిలో మొక్కలకు నీడ కల్పించారు. ఎండ వేడిమి ఎక్కువగా ఉండడంతో పంటను రక్షించుకోవడం రైతన్నలకు తీవ్ర సమస్యగా మారింది. మార్చి, ఏప్రిల్ నెలల్లో ఎండలు అధికం కావడంతో టమోటా మొక్కలను ఎండల బారీ నుంచి కాపాడు కోవడానికి ఓ రైతు తన .పొలంలో మొక్కలు నాటగానే వాటిపై కూలింగ్ షీట్‌ను అమర్చారు. ఇందుకోసం అదనంగా ఒక ఎకరాకు రూ. 35 వేలు ఖర్చు చేశారు. నీడతో పాటు చల్లదనం కూడా ఉండడంతో టమోటా మొక్కలు మామూలు కంటే ఏపుగా పెరుగుతున్నాయి. అదనంగా సస్యరక్షణ కోసం ఎక్కువగా పిచ్‌కారీ మం దులు వాడకుండా కృషి నిర్మాణ్ సంస్థ వారు తయారు చేసిన డ్రిప్ వాడడం వలన మొక్కలు మరింత ఏపుగా పెరుగుతు న్నట్లు రైతు ప్రకాష్‌రెడ్డి తెలిపాడు.

కూలింగ్ షీట్‌తో అదనపు ప్రయోజనం

కూలింగ్ షీట్‌ను 3 అడుగుల ఎత్తులో ఏర్పా టు చేసుకుంటే మొక్కకు నీడతో పాటు మొక్క పెరగడానికి దోహదపడుతుందన్నారు. తరువాత మొక్క 3 అడుగుల ఎత్తు పెరగగానే ఆ కూలింగ్ షీట్‌ను మరింత ఎత్తులో ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ షీట్ ఏర్పాటు చేయడం వలన మొక్కలకు చీడపీడలబెడద ఉండదన్నారు. అంతే కాకుండా పంట లకు పిచ్‌కారీ మందుల ఖర్చు తగ్గడంతో పాటు దిగుబడి బాగా వచ్చి రైతులకు లాభదాయకంగా ఉంటుందన్నారు. కర్ణాటక రాష్ట్రం చింతామణికి చెందిన ప్రకాష్‌రెడ్డి ఓ ప్రభుత్వ ఉద్యోగి. వ్యవసాయంపై మక్కువతో రంగసముద్రం పంచాయతీ సాలేవాండ్లపల్లె సమీపంలో 5ఎకరాల భూమిని లీజుకు తీసుకుని టమోటా పంటను వినూత్న పద్ధతిలో సాగు చేసి ఆదర్శగా నిలుస్తున్నాడు. తనకు వ్యవ సాయంపై మక్కువతో టమోటా పంట సాగుకు వినూత్న పద్ధతిలో సాగు చేసి దిగుబడిని సాదించేం దుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పుడున్న పోటీ ప్రపంచంలో వ్యవసాయం చేయాలంటే ఖర్చులు అధికంగా ఉండ డంతో సామాన్య రైతులు భయపడుతున్నారు.



టమోట పంటకు నీడ కోసం మెష్‌ను ఏర్పాటు చేస్తున్న కూలీలు

కూడు పెట్టని కులవృత్తి

- మట్టి కుండలకు కనిపించని ఆదరణ
- కష్టాల్లో కుమ్మరుల కుటుంబాలు

బద్వేలు టౌన్, మార్చి 31 : నల్లమన్నే వారి ఆస్తి. వారి ప్రపంచం. కుమ్మరిసారే జీవితం. మండువేసవిలో చల్లని నీటిని అందించే కుండను తయారు చేసే కుమ్మర్ల బతుకులు మాత్రం చల్లగా లేవు. రోజంతా కష్టపడిన కడుపు నిండా అన్నం తినలేని ఈ పని ఎందుకని అడిగితే ఇది మా కులవృత్తి, ఇదే మా దైవం అని అంటున్నారు. బద్వేలు నియోజకవర్గ వ్యాప్తంగా కుమ్మరులు కొన్ని కుటుంబాలు మట్టి కుండల తయారీతోనే ఉపాధి పొందుతున్నారు.

ఒకప్పుడు మట్టికుండ లేని ఇల్లు ఉండేది కాదు. వేసవి కాలం వచ్చిందంటే గతంలో ప్రతి ఇంట్లో ఒక మట్టికుండ ఉండేది. రైతులు, వ్యవసాయ కూలీలు కుండల్లో నీళ్లు పోసుకుని పొలంలోకి తీసుకెళ్లేవారు. వేసవిలో ఉప్పుబానలకు మంచి డిమాండ్. ప్రస్తుతం ఫ్రిజ్‌లు కూలర్ల రాకతో కుండను నమ్ముకున్న వారికి జీవనోపాధి కరువు అవుతోంది. మట్టికుండల ఆదరణ రోజురోజుకూ తగ్గిపోతుండడంతో దీంతో ఈ వ్యాపారం చేసేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా పలువురు కుమ్మర్లు చాలా కాలంగా మట్టి కుండల వ్యాపారం చేస్తున్నారు. ఫిబ్రవరి రెండో వారం నుంచి మే నెల ఆఖరు వరకు ఈ వ్యాపారం ఉంటుంది. ఐదేళ్ల క్రితం వేసవికాలంలో దాదాపు నియోజకవర్గ వ్యాప్తంగా వేసవికాలంలో నీటి కుండలు పల్లెపల్లెలో పట్టణాల్లో అమ్మేవారమని, ప్రస్తుతం 500 కుండలు కూడా అమ్ముడుపోవడంలేదని కుమ్మర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేవలం వేసవి కాలంలోనే తమకు వ్యాపారం ఉంటుందని వర్షాలు పడితే పూర్తిగా వ్యాపారం కనుమరుగవుతుందని వాపోతున్నారు.

తయారీ అంత సులువేం కాదు

కుండ, దుత్త, కూర పెనాలు, కూజాలు, కుండీలు, బానలు తయారు చేస్తారు. బంకమట్టి, ఎర్రమట్టి తీసుకువచ్చి నానబెడతారు. కొంత మంది రోడ్డుపై వేసి వాహనాల కింద తొక్కించి మట్టి ముద్దల్లా చేస్తారు. అనంతరం సారెపై వేసి తమకు కావాలసిన రీతిలో మలుచుకుంటారు. వాటిని ఎండబెట్టి బట్టీలో కాలుస్తారు. ఇంత కష్టపడి తయారు చేసిన కుండలను మార్కెట్లోకి తీసుకువెళ్లేసరికి నిరాశే ఎదురవుతోంది. దీంతో ఒకప్పుడు ఎంతో ఆనందంగా జీవించిన కుమ్మర్లు ప్రస్తుతం కష్టాల కడలిలో ఎదురీదుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు కుమ్మర్లపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి కుమ్మరబంధు పథకం పెట్టి కుమ్మర్లను ప్రభుత్వం ఆదుకోవాలని కుమ్మర్లు కోరుతున్నారు.



అమ్మకానికి సిద్ధంగా ఉన్న మట్టికుండలు

కుండల తయారీలోనే సంతృప్తి

ఎంత చదువుకున్నా కులవృత్తి అయిన కుండల తయారీలోనే ఎంతో సంతృప్తి ఉంది. ఇంట్లో వాళ్లకు చేదోడుగా ఇంటి పట్టునే ఉండి కుటుంబంతో పనిచేసుకుంటూ రోజుకు 20కి పైగా కుండలు తయారు చేస్తున్నాం. కానీ మాకు కూలి గిట్టుబాటు కావడంలేదు. ఇప్పటికైనా ప్రభుత్వాలు కుమ్మర్లను ఆదుకుని అవకాశాలు కల్పిస్తే మరింత లాభసాటిగా కుండల వ్యాపారం చేసుకుంటాం.

- జి.రమణయ్య

అమ్మకాలు తగ్గాయి

పల్లెల్లో ఫ్రిడ్జ్‌లు వాడకంలోకి రావడంతో మట్టి కుండలు వినియోగించేవారు తగ్గిపోయారు. అయినా శుభ అశుభ కార్యాలకు కొత్త కుండలు వాడడం ఆగలేదు. గతంలో కుండలు అమ్మితే వచ్చే దాంట్లో కుటుంబం సజావుగా సాగుతుండేది. ప్రస్తుత ఆధునిక యుగంలో ఎలక్ట్రిక్ వస్తువులు వాడకంలోకి రావడంతో కుమ్మర్ల వ్యాపారాలు తగ్గుముఖం పట్టాయి.

- గురయ్య

పొట్టకూటి కోసం వచ్చి.. అనంతలోకాలకు

- విద్యుదాఘాతంతో ఒకరి మృతి.. మరొకరికి గాయాలు.. పొరపాటా లేక నిర్లక్ష్యమా..





మృతిచెందిన సాగర్, చికిత్స పొందుతున్న లక్ష్మణ్

లింగాల, మార్చి 31: విద్యు త్ లైన్ ఏర్పాటు పనుల ని మిత్తం వలస వచ్చిన ఇద్ద రు యువకు విద్యుదాఘా తానికి గురై స్తంభం మీది నుంచి కిందపడగా, ఒకరు మృతి చెందారు. మరో యువకుడు మృత్యువుతో పోరాడు తున్నాడు. ఎస్‌ఐ కృష్ణయ్య కథనం మేరకు తెలంగాణ రాష్ట్రంలోని వి.ఎం.బంజర్ గ్రామానికి చెందిన 11 మంది కూలీలు 15 రోజుల క్రితం లింగాల మండలం లోపట్నూతలకు వచ్చారు. గ్రామ సమీపంలో విద్యుత్ లైన్ ఏర్పాటు పనులు చేస్తున్నారు. వారిలోని లక్ష్మణ్ (25), సాగర్ (19) ఆదివారం మధ్యాహ్నం విద్యుత్ స్తంభం ఎక్కి పనులు చేస్తుండగా, విద్యుదాఘాతం తాకడం తో కిందపడ్డారు. వారిని పులివెందుల ఏరియా ఆసుపత్రికి తరలించగా సాగర్ (19) అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరిం చారు. లక్ష్మణ్ కుడి చేయి కాలిపోయి వేళ్లు వంగిపోగా, ప్రాథమిక చికిత్స చేసిన డాక్టర్లు కడపకు రెఫర్ చేశారు.

పొరపాటా.. నిర్లక్ష్యమా?

ఆ యువకులు పని చేస్తున్న స్తంభంపై నుంచి అంకాళమ్మ ఫీడర్, బాటమస్వామి ఫీడర్ల విద్యుత్ లైన్లు వెళుతున్నాయి. వీటిలో అంకాళమ్మ ఫీడర్‌కు ఎల్‌సీ ఇచ్చినట్లు తెలిసింది. అయితే, ఎల్‌సీ ఏ లైన్‌కు ఇచ్చారో తెలియని సాగర్, లక్ష్మణ్‌లు బాటమస్వామి లైన్‌కు అనుసంధాన పనులు చేపట్టేందుకు విద్యుత్ స్తంభం ఎక్కారు. సరైన సమాచారం లేని కారణంగా విద్యుత్ షాక్‌కు గురైనట్లు పలువురు చర్చించుకుంటున్నారు. ఒకే స్తంభానికి రెండు లైన్లు ఉన్నప్పుడు సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. కాంట్రాక్టు సంస్థ కార్మికులకు గ్లౌజులు, షూష్ లాంటి రక్షణ పరికరాలు ఇవ్వకుండానే పనులు చేయిస్తున్నట్లు సమాచారం. విద్యుత్‌లైన్ కన్‌ఫ్యూజన్ కారణంగా షాక్‌కు గురైనట్లు విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, కాంట్రాక్టు సంస్థ సరైన సదుపాయాలు కల్పించకపోవడంతో ఇలాంటి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయని పలువురు అంటున్నారు.

ఇరువర్గాల ఘర్షణ : కేసు నమోదు

పోరుమామిళ్ల, మార్చి 31 : పొలం గట్టు దాటారని ఓ వర్గం, తమ పొలంలో గొర్రెలు మేపారని మరో వర్గం పరస్పరం దాడులు చేసుకోవడంతో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. పోరుమామిళ్ల మండలంలోని సిద్ధనకిచ్చాయపల్లెకు చెం దిన కొత్తూరి రంగయ్య పొలంలో మూడు నెలల క్రితం లక్ష్మీనరసమ్మ భర్త వెంకటరమణ ట్రాక్టరుతో వెళ్లగా అప్పట్లో వారు అభ్యంతరం తెలిపారు. మూడు రోజుల క్రితం తమ పొలంలో గొర్రెలు మేశాయంటూ లక్ష్మీ నర సమ్మ, వెంకటరమణలు కొత్తూరు రంగయ్యతో గొడవ పడ్డారు. దీంతో ఇరువర్గాలు ఘర్షణ పడ్డాయి. లక్ష్మీనరసమ్మ వెంకటరమణ, రమణయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొత్తూరిరంగయ్య, సావిత్రి, నారాయణపై, కొత్తూరి రంగయ్య కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు లక్ష్మీ నరసమ్మ, వెంకటరమణ, రమణయ్యలపై శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఇదిలా ఉండగా లక్ష్మీనరసమ్మ ఆత్మహత్యాయత్నం చేయడం చర్చనీ యాంశమైంది.



చికిత్స పొందుతున్న లక్ష్మీనరసమ్మ

మద్యం మత్తులో దాడి. ఒకరికి తీవ్ర గాయాలు

పులివెందుల రూరల్, మార్చి 31: మద్యం మత్తులో ఓ వ్యక్తి దాడి చేయగా మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్‌ఐ అరుణ్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం రాత్రి 7:40గంటల ప్రాంతంలో పులివెందుల పట్టణంలోని పార్నపల్లె రోడ్డులోని వైన్ షాప్ సమీపంలో రవి, బబ్లూ అనే వ్యక్తులు మద్యం సేవించారు. వీరిలో బబ్లూ అనే వ్యక్తి తనకు ఇవ్వాల్సిన అప్పు ఎప్పుడుఇస్తావని అడగ్గా ఇపుడు తన వద్ద లేదని రవి సమాధానమివ్వడంతో మాటామాటా పెరిగింది. దీంతో ఆగ్రహానికి గురైన బబ్లూ బీరు బాటిల్‌తో తలపై కొట్టడంతో రవి తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతనిని పులివెందుల ఏరియా ఆసుపత్రికి తరలించి, ప్రాథమిక చికిత్స అనంతరం పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. దాడి చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామన్నారు. కాగా రవి యూసీఐఎల్‌లో ఉద్యోగి.



చికిత్స పొందుతున్న రవి

జూదరుల అరెస్టు

తుళ్లూరు, మార్చి 31 : మండల పరిధిలోని దిగువపల్లెలో కొన్ని రోజులుగా జూదమాడుతున్నారన్న విషయం తెలియడంతో ఎస్‌ఐ కత్తి వెంకటరమణ ఆదివారం ఉదయం దాడులు నిర్వహించారు. 9 మందిని అరెస్టు చేసి రూ.1,01,020 స్వాధీనం చేసుకున్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తెలిపారు.



అరెస్టు అయిన జూదరులు

ప్రవేశానికి 5 వరకు గడువు

ఓబులవారిపల్లె, మార్చి 31: ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాల (బాలుర) ముక్కావారిపల్లెలో 2024-25 సంవత్సరానికి 5వ తరగతిలో 80 సీట్లకు, 6, 7, 8వ తరగతుల్లో మిగిలి వున్న సీట్ల ప్రవేశానికి ఏప్రిల్ 5వ తేదీ వరకు దరఖాస్తు గడువు పొడిగించినట్లు ముక్కావారిపల్లె ప్రిన్సిపల్ పి.ప్రసాద్ తెలిపారు. హెచ్‌టీటీపీ.ఏపీఆర్ఎస్.ఏపీసీఎఫ్ఎస్.ఇన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని, విద్యార్థులు, తల్లిదండ్రులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ముఖరంచాంద్‌కు డాక్టరేట్



పుల్లంపేట, మార్చి 31: మండలంలోని అప్పయ్యరాజుపేటకు చెందిన జనసేన పార్టీ రాజంపేట ఇన్‌చార్జి సయ్యద్ ముఖరంచాంద్ డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ఏషియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ ఈ డాక్టరేట్‌ను తమిళనాడు రాష్ట్రం కోసూరులోని క్రిష్ణ హోటల్‌లో అందజేసింది. వివిధ రంగాల్లో చేసిన సేవలకు గానూ ఆయనకు ప్రముఖుల చేతుల మీదుగా డాక్టరేట్ పట్టాను అందజేసింది. ఈ సందర్భంగా ప్రజా సేవ చేసినందుకు జనసేన నాయకులకి డాక్టరేట్ అందుకోవడంపై జనసేన నాయకులు మిత్రులు పంచుకొని ఆనందం వ్యక్తం చేశారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

సిద్దవటం, మార్చి 31: మండలంలోని మాచుపల్లి గ్రామ పంచాయతీ తురకపల్లె గ్రామంలో రంజాన్ ఉపవాసాల సందర్భంగా రాజంపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి సుబ్రమణ్యం ఆధ్వర్యంలో రాజంపేట టీడీపీ పార్లమెంటు ప్రధాన కార్యదర్శి నాగముని రెడ్డి ముస్లింలకు ఆదివారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీలో ముస్లింలకు రంజాన్ తోఫా అందజేసి వారి దీవెనలు పొందిన ఏకైక వ్యక్తి చంద్రబాబునాయుడు అని ఆయన కొనియాడారు. ఎంతో పవిత్రమైన రంజాన్ మాసంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇవ్వడం సంతోషంగా ఉందని తెలియజేశారు.

ఘనంగా షష్ఠి పూజలు

నందలూరు, మార్చి 31: నందలూరు రైల్వే కేంద్రంలో వెలసిన వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో షష్ఠి సందర్భంగా ఆదివారం సుబ్రమణ్యస్వామికి ఘనంగా సామూహిక అభిషేకాలు, అలంకరణలు, తీర్థప్రసాద వినియోగ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు రవిస్వామి ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్త రమణారెడ్డి, పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా పునరుత్థాన వేడుకలు

లక్కిరెడ్డిపల్లె, మార్చి 31: గుడ్‌ఫ్రైడే సందర్భంగా ఏసు ప్రభువు మానవాళి మనుగడకు శిలువ మోసి ప్రాణాలను వదిలి తిరిగి ఆదివారం తెల్లవారుజామున పునరుద్ధరించారని క్రైస్తవులు చర్చిలలో ప్రార్థనలు నిర్వహించారు. 40 రోజుల పాటు ఉపవాసాలు ఉండి ఆదివారం తెల్లవారుజాము నుంచి చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించారు. లక్కిరెడ్డిపల్లెలో లూథరన్, మిస్సా, సెయింట్, చింతకుంటపల్లె, వంకిరెడ్డిపల్లె, మద్దిరేవుల, దప్పేపల్లె చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించారు.

12 మందికి కంటి ఆపరేషన్లు

రాయచోటిటౌన్, మార్చి 31: జిల్లా కేంద్రమైన రాయచోటి మండల పరిధిలోని చెన్నముక్కపల్లె గ్రామంలో గల లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం జరిగిన కంటి వైద్య శిబిరంలో 12 మందికి కంటి ఆపరేషన్లు నిర్వహించారు. ఈ సందర్భంగా రాయచోటి నియోజకవర్గంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన 45 మందికి కంటి పరీక్షలు నిర్వహించిన వైద్యులు అందులో 12 మందికి ఆపరేషన్లు నిర్వహించారు. గతంలో ఆపరేషన్ చేయించుకున్న 18 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా అద్దాలు, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కంటి ఆసుపత్రి చైర్మన్ వైసీపీ స్వరూపగుప్త, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్‌బాషా, జయరామిరెడ్డి, కంటి వైద్యులు సురేశ్‌బాబు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మతల్లికి పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

లక్కిరెడ్డిపల్లె, మార్చి 31: మండలంలోని అనంతపురం గ్రామంలో వెలసిన గంగమ్మతల్లికి ఆదివారం పూజలు నిర్వహించారు. గంగమ్మజాతర ముగిసిన మూడవ ఆదివారం కావడంతో భక్తుల రద్దీ పెరిగింది. జాతర జరిగిన నాలుగు ఆదివారాలు ప్రతి ఆదివారం గంగమ్మజాతర అత్యంత వైభవంగా జరుగుతుంది. ఈ వారం కూడా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు, మొక్కుబడులు సమర్పించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. ప్రతి ఆదివారం జాతరలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తారు.

పూత రాక.. కాయలు కాయక

- మామిడి రైతులపై మిచౌంగ్ ప్రభావం
- భారంగా మారిన వ్యవసాయం



పూతరాని మామిడి చెట్లు

చిట్వేలి, మార్చి 31: కష్టాలను చేత బట్టి.. శ్రమను పెట్టుబడిగా చేసుకొని.. వ్యవసాయమే ఆధారంగా ఉన్న రైతన్నలకు వ్యవసాయం కలిసిరావడం లేదు. వాతావరణ మార్పులు, ప్రకృతి కన్నెర్రతో మామిడి రైతులకు గడ్డుకాలం ఏర్పడింది. గత ఏడాది డిసెంబరులో కురిసిన మిచౌంగ్ తుఫాను ప్రభావంతో తోటలు దెబ్బతిన్నాయి. ఆ సమయంలో పూత కోసం పిచికారీ చేసిన మందు ద్రావణం ప్రభావం పోయింది. ఈ ప్రతికూల పరిస్థితుల్లో పూత నిలవడం లేదు.. కాపు ఎక్కడో ఓ చోట వస్తున్నా నాణ్యత ఉండడం లేదు. సీజన్ ప్రారంభమైనా దిగుబడి రాకపోవడంతో రైతుల్లో దిగులు మొదలైంది. ఉద్యాన పంటలకు నిలయమైన చిట్వేలి మండలంలో అత్యధికంగా 4200 ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. గత ఏడాది డిసెంబరులో మిచౌంగ్ ప్రభావంతో మామిడి పూత పూర్తిగా పోయింది.

మంచు దెబ్బకు రాలిపోతూ..

గత ఏడాది డిసెంబరులో కురిసిన వర్షాలకు తోటల్లో మొక్కలు చాలా వరకు నేలవాలాయి. కొమ్మలు విరిగిపడిన పరిస్థితి. వీటి పునరుద్ధరణకు రైతులు నానా కష్టాలు పడ్డారు. ఏడాది కాపు 25-30 శాతం పూత మించలేదని రైతులు వాపోతున్నారు. ఆ తరువాత పూత వస్తున్నా పురుగు ప్రభావం ఎక్కువైంది. జనవరి ఫిబ్రవరిలో మంచు దెబ్బకు ఉన్న పూత పూర్తిగా రాలిపోయింది. వచ్చిన కాగా వచ్చిన పిందెలు రాలిపోతున్నాయని రైతులు వాపోతున్నారు.

పెరిగిన పెట్టుబడులు...

పెరిగిన పెట్టుబడి, గిట్టుబాటు కాని ధరలు, అనుకూలించని వాతావరణంలో అన్నదాత నలిగిపోతున్నాడు. భారంగా మారిన వ్యవసాయంతో రైతు నష్టపోతూనే ఉన్నాడు. ఏటా నష్టాలను చవిచూస్తూ పడమటి తల్లిని నమ్ముకొని కష్టాన్ని పెట్టుబడిగా చేసుకొని వ్యవసాయం సాగిస్తున్నప్పటికీ రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాడు. ఫలితంగా అన్నదాతకు ప్రతి ఏటా అప్పులే మిగిలిపోతున్నాయి. ప్రభుత్వం రైతుల బాధలను గుర్తించకపోతే వ్యవసాయ రంగానికి గడ్డుకాలం ఏర్పడుతుందని రైతులు వాపోతున్నారు.

ఏటా కుదేలవుతున్న రైతులు



వాతావరణం మార్పుల వల్ల పూత రాలిపోతుంది. ఇప్పటికే ఐదు సార్లు మందులు పిచికారీ చేయాల్సి వచ్చింది. ఎకరాకు రూ.20 వేలు ఖర్చు వస్తోంది. ఏటా మామిడి రైతు నష్టాలు చవిచూస్తున్నాడు. రైతులను ప్రభుత్వం గుర్తించి ఆదుకోకపోతే వ్యవసాయం కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడుతుంది.

- ఎం.నాగేంద్ర, రైతు, గొల్లపల్లి

ఐదేళ్ల పాలనలో అవినీతి, అక్రమాలే

- రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు జగన్ తీరని అన్యాయం
- మీడియాతో మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, మార్చి 31: వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలన అవినీతి, అక్రమాలు, అరాచకాలు, దాడులు, దౌర్జన్యాలతో సాగిందని రాయచోటి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి జగన్ ప్రభుత్వంపై మండిపడ్డారు. ఆదివారం ఆయన బీజేపీ, జనసేన నేతలతో కలిసి రాయచోటి పట్టణంలోని ఎస్ఎన్‌కాలనీలో గల టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. గడిచిన ఐదేళ్ల కాలంలో వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలోని ఏ వర్గానికి న్యాయం చేసిన దాఖలాలు లేవన్నారు. దోచుకో.. దాచుకో అనే విధంగా వైసీపీ పాలన సాగిందని, రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడ చూసినా వైసీపీ నేతల భూకబ్జాలు, ఇసుక, మట్టి అక్రమ రవాణాలు, మద్యం మాఫియా, గంజాయి మాఫియాలతో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని ఆరోపించారు. ప్రధానంగా పోలవరం, హంద్రీ-నీవా, గాలేరు- నగరి, సుజల స్రవంతి తదితర ప్రాజెక్టులతో పాటు వరదలకు కొట్టుకుపోయిన పింఛా, అన్నమయ్య ప్రాజెక్టులపై కూడా సీఎం పూర్తి స్థాయి నిర్లక్ష్యం చూపించారన్నారు. టీడీపీ హయాంలో రంజాన్ పండుగ సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు రంజాన్‌తోఫా కింద పేద ముస్లిం మైనార్టీలకు సరుకులు అందించి వారు పండుగను సంతోషంగా జరుపుకునేలా చేశారన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని రద్దు చేసి మైనార్టీలకు తీరని అన్యాయం చేశారన్నారు. ఇక నియోజకవర్గానికి వస్తే ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి హంద్రీ-నీవా ప్రాజెక్టు ద్వారా వెలిగల్లు, శ్రీనివాసపురం రిజర్వాయర్, ఝరికోన ప్రాజెక్టులతో పాటు అన్ని చెరువులకు సాగునీరు అందిస్తానని, వెలిగల్లు ప్రాజెక్టు నుంచి అన్ని మండలాలకు తాగునీరు సరఫరా చేస్తామని హామీలు ఇచ్చి ఐదేళ్లలో ఏ ఒక్క గ్రామానికి తాగునీరు అందించిన దాఖలాలు లేవన్నారు. రూ.300 కోట్లతో రాయచోటి మున్సిపాలిటీలో అండర్ డ్రైనేజ్ అని చెప్పి జనసంచారం లేని ప్రాంతాల్లో వైసీపీ నేతలు రియల్ ఎస్టేట్ వసుల కోసం అండర్ డ్రైనేజ్ పనులు చేపట్టడం బాధాకరమన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాష్ట్రంలోని అన్ని వర్గాల అభివృద్ధితో పాటు నియోజకవర్గంలో అన్ని రంగాలుగా అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ప్రతిపక్షురాల రాబోయే ఎన్నికల్లో టీడీపీని ఆదరించి చంద్రబాబును సీఎం చేసుకోవడం ద్వారా అవినీతి, అరాచకాలు, అక్రమాలతో భ్రష్టు పట్టిపోయిన రాష్ట్రాన్ని కాపాడుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఖాదర్‌బాషా, సంబేపల్లె మాజీ సర్పంచ్ నాగేశ్వర్‌నాయుడు, బీజేపీ నేతలు నిర్మలకుమార్, శివ ప్రసాద్, రమణ, జనసేన నేతలు, టీడీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

జయహో బీసీ ఆత్మీయ సమావేశం..

టీడీపీతోనే బీసీలకు న్యాయం జరుగుతుందని, బీసీల సామాజిక, ఆర్థిక, రాజకీయ ఎదుగుదలే లక్ష్యంగా టీడీపీ కృషి చేస్తుందని బీసీల ఆత్మగౌరవాన్ని ఎప్పటికీ తగ్గనివ్వమని రాయచోటి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాయచోటి మండల పరిధిలోని మాధవరం గ్రామంలో జయహో బీసీ ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ, జనసేన, ఎన్డీఏ కూటమితోనే బీసీల అభ్యున్నతి సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా, మాజీ సర్పంచ్ నాగేశ్వరనాయుడు, రవీంద్రరెడ్డి, బీసీ నాయకులు రఘుపతినాయుడు, రెడ్డెప్పనాయుడు, టీడీపీ నేతలు రంగారెడ్డి, హస్సేన్‌బాషా, బీజేపీ యువమోర్చా శివప్రసాద్, వెంకటరెంగయ్య, రామాంజులు, శివప్రసాద్ పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు..

రాయచోటి నియోజకవర్గంలోని మైనార్టీల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తామని రాయచోటి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం పట్టణంలోని గ్రాండ్ పంక్షన్ హాలులో మైనార్టీలకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మైనార్టీలతో కలిసి ప్రార్థనలు నిర్వహించిన అనంతరం అందరికీ భోజనం వడ్డించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో మైనార్టీలు భక్తిశ్రద్ధలతో ఉపవాసాలు ఉండడం ఎంతో పుణ్య కార్యక్రమన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఖాదర్‌బాషా, మున్సిపల్ కోఆప్షన్ మాజీ సభ్యులు నల్లాషరీఫ్, మాజీ కౌన్సిలర్ ఖాదర్, టీడీపీ మైనార్టీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి : సుగవాసి ప్రసాద్

సుండుపల్లె, మార్చి 31: చంద్రబాబుతోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని, టీడీపీ కోసం పనిచేసిన ప్రతి ఒక్కరిని అండగా ఉంటామని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమిలో భాగంగా టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా సుగవాసి బాలసుబ్రమణ్యం, రాజంపేట ఎంపీగా నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని పోటీ చేస్తున్నారని వారిని అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. టీడీపీలోకి వచ్చే వారిని ఆహ్వానిస్తున్నామని, పార్టీ కోసం పనిచేసిన వారికి మరింత ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రెడ్డెప్ప రమేశ్‌నాయుడు, వెంకటేశ్వర్లునాయుడు, రాజకుమార్‌రాజు, మేకల మహబూబ్‌బాషా, శివరాంనాయుడు, వెంకట్రమణ, సురేశ్‌నాయుడు, ప్రసాద్‌రాజు, చంద్రశేఖర్‌రాజు, దామోదర్‌నాయుడు, యర్రంరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, చిట్టెం రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

పాలేటమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

చిన్నమండెం, మార్చి 31: మండలంలోని దిగువగొట్టివీడు పాలేటమ్మ తల్లికి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ప్రసాద్‌బాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం రాత్రి పాలేటమ్మ జాతర సందర్భంగా బలిపశువుకు చెందిన కోటేటి వెంకట్రమణ కట్టిన చాందినీ బండికి పూజ చేసి కొబ్బరికాయ కొట్టి ప్రసాద్‌బాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు నాగేశ్వర్‌నాయుడు, మాజీ ఎంపీటీసీ ప్రతాప్‌నాయుడు, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రమణ, సిద్ధయ్యనాయుడు, కాంట్రాక్టర్ దేవగిరి పాలేనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన పలు కుటుంబాలు



ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన గ్రామస్తులు

చాకిబండ గ్రామ పంచాయతీకి చెందిన పలు కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వీరిని సుగవాసి ప్రసాద్‌బాబు, ఎమ్మెల్యే అభ్యర్థి రాంప్రసాద్‌రెడ్డి వేర్వేరుగా పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాంప్రసాద్‌రెడ్డి, ప్రసాద్‌బాబులు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను సహించలేక ఆ పార్టీని వీడి టీడీపీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. టీడీపీని ఒక్కసారి ఆశీర్వదించండి రాయచోటి అభివృద్ధి చేసే బాధ్యత తాము తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అల్తాఫ్‌బాషా, సాయిక్, మునవ్, అనీస్, మనూర్, ఖదీర్, వెంకటరెడ్డి, చిన్నపరెడ్డి, అక్కులరెడ్డి, ఆంజనేయులురెడ్డి, పాపిరెడ్డి, బాలక్క, రామసుబ్బమ్మ, శశి, అంజి పాల్గొన్నారు.

నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డితో కస్తూరి భేటీ



కిరణ్‌కుమార్‌రెడ్డితో సమావేశమైన విశ్వనాథనాయుడు

రైల్వేకోడూరు, మార్చి 31: బీజేపీ రాజంపేట ఎంపీ అభ్యర్థి, మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డితో టీడీపీ రైల్వేకోడూరు సీనియర్ నాయకుడు కస్తూరి విశ్వనాథనాయుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త మాదినేని విశ్వేశ్వరనాయుడులు ఆదివారం కలికిరిలో భేటీ అయ్యారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో ప్రస్తుతం జరుగుతున్న రాజకీయ పరిణామాలను కిరణ్‌కుమార్‌రెడ్డికి వివరించారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతమైందని, నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా ఉన్నారన్నారు. ఎన్నికల్లో ఉమ్మడి పార్టీల అభ్యర్థి గెలుపు సులభంగా ఉంటుందని వివరించారు. టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు ఉమ్మడిగా ప్రచారాలు ముమ్మరంగా చేసి అభ్యర్థుల విజయానికి పాటుపడతారన్నారు. రాజంపేట ఎంపీ స్థానానికి పోటీ చేస్తున్న కిరణ్‌కుమార్‌రెడ్డి విజయం ఖాయమని కస్తూరి తెలిపారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు.

అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి పనిచేస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న వివిధ మండలాల అధ్యక్షులు

రాజంపేట, మార్చి 31: టీడీపీ అధిష్ఠానం నిర్ణయానికి తాముందరం కలిసి కట్టుగా పార్టీ విజయానికి పనిచేస్తామని టీడీపీ మండలాల అధ్యక్షులు తెలిపారు. ఆదివారం పట్టణంలోని చమర్తి జగన్‌మోహన్‌రాజు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ తమ అధినేత చంద్రబాబు సరైన అభ్యర్థిని ఎన్నుకుంటారని, అదే విధంగా ప్రస్తుతం రాజంపేట అభ్యర్థిని నిర్ణయించడంలో కూడా అదే విధానాన్ని అనుసరించారని తెలిపారు. పార్టీ అభివృద్ధి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, పార్టీ నిర్ణయానికి సహకరిస్తే భవిష్యత్తులో పార్టీ మంచిస్థానాన్ని కల్పిస్తుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీగల్ సెల్ అధ్యక్షుడు తరిగొండ లక్ష్మీనారాయణ, రూరల్ అధ్యక్షుడు గన్నె సుబ్బనరసయ్య, సుండుపల్లె మండలాధ్యక్షుడు రెడ్డప్ప, వీరబల్లి మండలాధ్యక్షుడు భానుగోపాల్‌రాజు, ఒంటిమిట్ట మండలాధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి పాల్గొన్నారు.

పుల్లయ్య సేవలు ఎనలేనివి



పుల్లయ్యను సన్మానిస్తున్న దృశ్యం

నందలూరు, మార్చి 31: మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ ఇసుకపల్లె ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ వృత్తి నిర్వహిస్తున్న అనంపల్లి పుల్లయ్య సేవలు ఎనలేనివని వక్తలు, మాజీ ఎంఈఓ చెంగలరెడ్డి, ప్రస్తుత మండల విద్యాశాఖాధికారులు నాగయ్య, అనంతకృష్ణ, నాగిరెడ్డిపల్లె సర్పంచ్ జంబు సూర్యనారాయణలు కొనియాడారు. నాగిరెడ్డిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో పుల్లయ్య పదవీ విరమణ ఆత్మీయ సభను ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నేతలు ఆల్లం అశోక్‌కుమార్, మహాలయ్య, రౌఫ్‌బాషా, ఎం.ఎం.ఆలీఖాన్, లీలాకృష్ణ, కృపానందం, పవీవల్లు, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు రూ.6 వేలు పెన్షన్ ఇవ్వాలి



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న వికలాంగుల సంఘం నేతలు

రాజంపేట టౌన్, మార్చి 31: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వికలాంగులకు రూ.6 వేలు పెన్షన్ పథకాన్ని అమలు చేసే పార్టీకే తమ సంఘం ఓటు వేస్తామని వికలాంగుల ప్రతిభావంతుల సంఘం సభ్యులు తెలిపారు. ఆదివారం పట్టణంలోని న్యూఆంధ్రా కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు గుజారీఖా, పేడబ్యాడీ పెదరెప్ప ఉపాధ్యక్షుడు మురళి మాట్లాడుతూ అంగవైకల్యమైన తమ అన్ని రంగాల్లో ముందున్నామని, ప్రతిభావంతులను గుర్తించి ప్రభుత్వాలు తమకు ఆర్థిక స్థితి మెరుగు పడేలా పథకాలు తీసుకురావాలన్నారు. చదువుకున్న వికలాంగులకు నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పుల్లంపేట అధ్యక్షుడు మల్లు సుబ్బనరసారెడ్డి, రాజంపేట ఉపాధ్యక్షుడు ఖాదర్ బాష, సభ్యులు రెహమాన్, ప్రసాద్, పెనగలూరు అధ్యక్షుడు తిరుపాల్, ఒంటిమిట్ట అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, గౌరవాధ్యక్షుడు తిరుమలరెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్యానికి నడక ఎంతో ప్రయోజనకరం



శరత్‌కుమార్‌రాజును సన్మానిస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

రాజంపేటటౌన్, మార్చి 31: ప్రతి రోజూ ప్రతి వ్యక్తి దినచర్యలో భాగంగా నడక నిర్వహిస్తే ఆరోగ్యం తమ సొంతమవుతుందని వాకర్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కొండూరు శరత్‌కుమార్‌రాజు పేర్కొన్నారు. ఆదివారం రాజంపేట మండల పరిధిలోని ఇంటర్నేషనల్ హైవేపోర్‌లో వాకర్స్ ఇంటర్నేషనల్ 157 కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు మురళీమోహన్‌రావు, సెక్రటరీ ప్రదీప్‌కుమార్, ట్రెజరర్ ఎస్ఎం అక్బర్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శారీరక, మానసిక ధృఢత్వానికి నడక ఎంతో ఉపయోగపడుతుందని వారు తెలిపారు. అనంతరం వాకర్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కొండూరు శరత్‌కుమార్‌రాజును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, వాకర్స్, పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి పోటెత్తిన జనం

- పెద్దఎత్తున అన్నదానాలు
- పౌరాణిక నాటకాలు



ప్రత్యేక అలంకరణలో రంగనాయకస్వామి

రాజంపేట, మార్చి 31: జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన చిట్వేలి మండలం రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా నాల్గవ రోజు ఆదివారం భారీ ఎత్తున భక్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎగువపల్లె గ్రామస్తులచే సత్యహరిశ్చంద్ర నాటకాన్ని ప్రదర్శించారు. ఆదివారం మధ్యాహ్నం నగిరిపాడు గ్రామస్తులు చొవవరం నరసింహారెడ్డి, సుగుణమ్మ కుటుంబీకులచే అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి ఎగువపల్లె గ్రామస్తులు కట్టా నాగేశ్వరయ్య, ఇందిరమ్మ కుటుంబ సభ్యులచే అన్నదానం నిర్వహించారు. ఆదివారం రాత్రి జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో చిట్వేలి, కోడూరు, ఓబులవారిపల్లె, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు నుంచి పెద్దఎత్తున భక్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ కమిటీ సభ్యులు, చుట్టుపక్కల గ్రామ పెద్దలు ఉత్సవాలను పర్యవేక్షించారు. ఆలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలంకరణతో అందంగా తీర్చిదిద్దారు.

వచ్చే ఎన్నికల్లో వైసీపీ ఓటమి ఖాయం: బీజేపీ



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న పనతల సురేష్

రైల్వేకోడూరు, మార్చి 31: వచ్చే ఎన్నికల్లో వైసీపీ ఓటమి ఖాయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పనతల సురేష్ తెలిపారు. ఆదివారం బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైల్వేకోడూరు నియోజకవర్గంలో బీజేపీ, టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి గెలుపు ఖాయమన్నారు. రైల్వేకోడూరు ఎమ్మెల్యే నాలుగు సార్లు గెలిచి అభివృద్ధిని మరిచాడని ఆరోపించారు. మంగంపేట ప్రముఖ పారిశ్రామికవేత్త పలుపత్యాల రామసుబ్బారెడ్డి బీజేపీలో చేరడంతో మరింత బలం ఏర్పడిందన్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో నియోజకవర్గంలో భూమి పూజలు, శంకుస్థాపనలు చేశారన్నారు. నిధులు లేకుండా పనులు ఎలా చేస్తారని ప్రశ్నించారు. నాలుగు సార్లు గెలిచిన ఎమ్మెల్యే ఆస్తులు పెంచుకున్నారే తప్ప అభివృద్ధి ఏమీ లేదన్నారు. ఎమ్మెల్యే స్వగ్రామాన్ని చూస్తే జాలేస్తుందన్నారు. ఎమ్మెల్యే తన స్వగ్రామానికి బ్రిడ్జిని నిర్మించుకోలేకపోయారని తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి ఒక అసెంబ్లీ స్థానాన్ని కేటాయించాలన్నారు. రైల్వేకోడూరు అసెంబ్లీ ఇన్‌చార్జ్ గద్దం చంగల్‌రాజు మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అక్రమ వ్యాపారాలు, దోపిడీలు, ఎర్రచందనం స్మగ్లింగ్, దాడులు తదితరవి పెరిగిపోయాయని తెలిపారు. జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు దాసరాజు జయప్రకాష్‌నారాయణవర్మ మాట్లాడుతూ వైసీపీ రైతులకు ఏమీ చేయలేదని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం ఇటీవల బీజేపీలో చేరిన ప్రముఖ పారిశ్రామికవేత్త పలుపత్యాల రామసుబ్బారెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు తోట శ్రీనివాసులు, వాకదర్ల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

వాల్మీకిపురం, మార్చి 31: అనుమానాస్పదస్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం వాల్మీకిపురం మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని చింతపర్తి గ్రామ సమీప బాహుదా కాలువలో 41సంవత్సరాల వయసు గల ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆదివారం శవమై కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ నాగేశ్వర్‌రావ్ సంఘటనాస్థలానికి చేరుకుని వివరాలు ఆరా తీశారు. మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చగా మృతుడు ఎరుపు రంగు టీషర్ట్, నీలం రంగు ఫుల్ డ్రాయర్ ధరించి ఉన్నాడని, అంతేకాక అతడి చేతి పైన రాములమ్మ, బాలరాజు అనే పేర్లు పచ్చబొట్టు కూడా ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. కాగా ఎవరైనా హతమార్చి మృతదేహాన్ని బాహుదా కాలువలో పడేసారా? లేక అతనే ఆత్మహత్యకు పాల్పడ్డాడా? అన్న అనుమానాలు పోలీసుల దర్యాప్తులో తెలిసే అవకాశం ఉంది.

ఇరు వర్గాల మధ్య భూ వివాదం రైతుపై హత్యాయత్నం


గాయపడిన రైతు నాగరాజు

మదనపల్లె టౌన్, మార్చి 31: ఇద్దరు రైతుల మధ్య భూ వివాదం ఘర్షణలకు దారి తీసింది. దీంతో ఓ రైతుపై ప్రత్యర్థి వర్గం కొడవలితో దాడి చేయడంలో చేతి వేళ్లు తెగిపోయాయి. మదనపల్లె మండలం పోతబోలు పంచాయతీ పాలెంకొండకు చెందిన నాగ రాజుకు ఇదే గ్రామానికి చెందిన చిన్నప్ప కుటుంబానికి భూ తగాదాలు ఉన్నాయి. ఈ క్రమంలో ఆదివారం నాగరాజు తన పొలం వద్ద నీరుకడుతుండగా అతని ప్రత్యర్థులైన మురళి, చినప్ప, చిన్నక్కలు కలసి దాడి చేశారు. నాగరాజు తిరగబడటంతో మురళి వర్గం కొడవలితో నాగరాజుపై దాడి చేశారు. నాగరాజు. చేయి అడ్డం పెట్టడంతో అతని వేళ్ల తెగికిందపడిపోయాయి. దీంతో పాటు అతని తలపై తీవ్రగాయమైంది. సమాచారం అందుకున్న కుటుంబీకులు నాగరాజును మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించగా అతని పరిస్థితి విషమంగా వుండటంతో తిరుపతికి రెఫర్ చేశారు. ఈ మేరకు అవుట్‌పోస్టు పోలీసులు మదనపల్లె తాలూకా పోలీసులకు సమాచారం అందించారు.

టీడీపీ నాయకుడికి కిశోర్‌కుమార్ రెడ్డి పరామర్శ

కలికిరి, మార్చి 31: గుట్టపాలెం పంచాయతీ వైకే పల్లెకు చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు రాజగోపాల్ రెడ్డిని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి ఆదివారం పరామర్శించారు. రాజగోపాల్‌రెడ్డి తండ్రి రాజారెడ్డి శనివారం రాత్రి కన్ను మూశారు. విషయం తెలిసిన కిశోర్‌కుమార్ రెడ్డి వైకే పల్లెకు వెళ్లి రాజారెడ్డి భౌతికకాయానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాజగోపాల్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయన వెంట మాజీ సర్పంచు కేవీ రెడ్డి, నాయకులు విజయకుమార్ రెడ్డి, రెడ్డెప్ప రెడ్డి, శ్రీనివాసులు, సుబ్బయ్య, యతీంద్ర యాదవ్, అశోక్, రామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిరుత తిరుగుతోందంటూ పుకార్లు

● అది హైనా అంటున్న అటవీ అధికారులు
● రైతులు భయపడవద్దంటూ సూచన


హైనా పాదముద్రలు, మాట్లాడుతున్న ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మదన్‌మోహన్‌రెడ్డి

పెద్దతిప్పసముద్రం మార్చి 31 : పీటీఎం శివారులోని హంద్రీ-నీవా కాలువ సమీపంలోని బోడిగుట్ట వద్ద గల ఓ మామిడి తోటలో గత రెండు రోజుల క్రితం రెండు చిరుత పులులు సంచరిస్తున్నాయని మామిడి తోట కాపలాదారుడు చెప్పడంతో ఆనోటా ఈనోటా పడి అది పెద్ద చర్చానీయాంశమైంది. అటు వైపు వెళ్లాలంటే పశువుల కాపర్లు, గొర్రెల కాపర్లు హడలెత్తి పోతున్నారు. రైతులు సైతం రాత్రి వేళల్లో పొలాల వద్దకు వెళ్లాలంటే బెంబేలెత్తి పోతున్నారు. ఆ మామిడి తోట యాజమానులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఆదివారం మదనపల్లె అటవీశాఖ రేంజర్ మదన్‌మోహన్‌రెడ్డి తమ సిబ్బందితో కలసి సంఘటనా స్థలానికి చేరుకుని మామిడి తోట పరిసర ప్రాంతాల్లో పరిశీలించారు. చిరుతగా అనుమానిస్తున్న పాదముద్రలను క్షుణ్ణంగా పరిశీలించి ఇవి చిరుత పాదముద్రలు కావని, హైనాగా ఉన్నట్లు అటవీశాఖ అధికారులు రైతులకు సూచించారు. రైతులు భయపడాల్సిన అవసరం లేదని, తమ సిబ్బందిచే రాత్రి వేళల్లో గస్తీ నిర్వహిస్తామన్నారు. ఆ మామిడి తోట చుట్టు పక్కల ఉన్న రైతులు తమకు సహకరించాలని ఆయన రైతులను కోరారు. రెండు రోజుల్లో అది చిరుత, లేక హైనా అనే విషయాన్ని తేల్చేస్తామని పేర్కొన్నారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సుధాకర్ రైతులు పాల్గొన్నారు.

70 ఆవులకు వైద్య చికిత్సలు


పశువైద్య శిబిరంలో ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

పీలేరు, మార్చి 31: పీలేరు లయన్స్ క్లబ్ సభ్యులు ఆదివారం కేవీపల్లె మండలంలోని జిల్లేళ్లమంద, దేవాండ్లపల్లె గ్రామాల్లో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 70 ఆవులు, 40 గొర్రెలకు వైద్య పరీక్షలు చేసి వాటికి అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. క్లబ్ సభ్యుడు రేవూరి సుధీర్ ఆర్థిక సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సురేంద్రనాథరెడ్డి, కార్యదర్శి సుబ్రహ్మణ్యం, కోశాధికారి జయచంద్ర నాయుడు, సభ్యులు డాక్టర్ ప్రసాద్, సుధాకర్ రెడ్డి, మహేశ్, రమణ, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల గడువు పొడిగింపు

గుర్రంకొండ, మార్చి 31:గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల గడువు పొడిగించినట్లు గుర్రంకొండ బాలిక గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సాయిశిరీష ఓ ప్రకటనలో తెలిపారు. గురుకుల ప్రవేశానికి దరఖాస్తు గడువు మార్చి 31న ముగియనుండగా గడువును ఏప్రిల్ 5వ తేదీ వరకు విద్యార్థులు దరఖాస్తు చేసుకొనేలా ప్రభుత్వం గడువు పొడిగించినట్లు ఆమె తెలిపారు. కావున 5వ తరగతి ప్రవేశానికి, 6, 7, 8 తరగతులో మిగిలిన సీట్లకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

టమోటా పంటకు వినూత్న సంరక్షణ

● ఎండ వేడిమి నుంచి నీడ కోసం మెష్ ఏర్పాటు ● రైతన్నల వినూత్న ఆలోచన ● అదనంగా ఎకరాకు రూ.35 వేలు ఖర్చు

పెద్దతిప్పసముద్రం మార్చి 31 : టమోటా పంట సంరక్షణ కోసం రైతన్నలు వినూత్న రీతిలో మెష్ ఏర్పాటు చేసి మొక్కలకు నీడ సౌకర్యం కల్పించారు. ప్రస్తుతం ఎండ వేడిమి ఎక్కువగా ఉండడంతో పంటను రక్షించుకోవడం రైతన్నలకు తీవ్ర సమస్యలు ఎదురవుతున్నాయి. దీంతో వినూత్న రీతిలో ఆలోచించి పంటను కాపాడుకోవడానికి మెస్ ఏర్పాటు చేసి రక్షణ కల్పించారు. మార్చి, ఏప్రిల్ నెలల్లో ఎండలు అధికం కావడంతో టమోటా మొక్కలను ఎండల బారీ నుంచి కాపాడుకోవడానికి ఓ రైతు తన .పొలంలో మొక్కలు నాటగానే మొక్కలు ఎండతాకిడికి వాడి పోకుండా ఉండేందుకు వాటిపై కూలింగ్ షీట్‌ను అమర్చారు. ఇందుకోసం అదనంగా ఒక ఎకరాకు రూ. 35 వేలు ఖర్చు చేశారు. టమోటా మొక్కకు నీడతో పాటు చల్లదనం కూడా ఉండడంతో టమోటా మొక్కలు మామూలు కంటే ఏపుగా పెరుగుతున్నాయి.కాగా ఇంకా మొక్కలకు అదనంగా సస్యరక్షణ కోసం ఎక్కువగా పిచ్‌కారీ మందులు వాడకుండా కృషి నిర్మాణ్ సంస్థ వారు తయారు చేసిన డ్రిఫ్ ఎరువులను వాడడం వలన మొక్కలు మరింత ఏపుగా పెరుగుతున్నట్లు రైతు ప్రకాష్‌రెడ్డి తెలిపాడు.

కూలింగ్ షీట్‌తో అదనపు ప్రయోజనం

మొక్కలకు కూలింగ్ షీట్‌ను 3 అడుగుల ఎత్తులో మొదటి విడతగా ఏర్పాటు చేసుకుంటే మొక్కకు నీడతో పాటు మొక్క పెరగడానికి దోహదపడుతుందన్నారు. తరువాత మొక్క 3 అడుగుల ఎత్తు పెరగగానే ఆ కూలింగ్ షీట్‌ను రెండవ దశలో మరింత ఎత్తులో ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ షీట్ ఏర్పాటు చేయడం వలన మొక్కలకు చీడపీడల వలన ఎక్కువ బెడద ఉండదన్నారు. అంతే కాకుండా పంటలకు పిచ్‌కారీ మందుల ఖర్చు తగ్గడంతో పాటు దిగుబడి బాగా వచ్చి రైతులకు లాభదాయకంగా ఉంటుందన్నారు.


టమోట పంటకు నీడ కోసం మెష్‌ను ఏర్పాటు చేస్తున్న కూలీలు

వ్యవసాయంపై మక్కువతోనే ప్రత్యేక చర్యలు

కర్ణాటక రాష్ట్రం చింతామణికి చెందిన ప్రకాష్‌రెడ్డి ఓ ప్రభుత్వ ఉద్యోగి. వ్యవసాయంపై మక్కువతో రంగసముద్రం పంచాయతీ సాలేవాండ్లపల్లె సమీపంలో 5ఎకరాల భూమిని లీజుకు తీసుకుని టమోటా పంటను వినూత్న పద్ధతిలో సాగు చేసి ఆదర్శగా నిలుస్తున్నాడు. తనకు వ్యవసాయంపై మక్కువతో టమోటా పంట సాగుకు వినూత్న పద్ధతిలో సాగు చేసి దిగుబడిని సాధించేం దుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పుడున్న పోటీ ప్రపంచంలో వ్యవసాయం చేయాలంటే ఖర్చులు అధికంగా ఉండ డంతో సామాన్య రైతులు భయపడుతున్నారు.

ఆనందోత్సాహాలతో ఈస్టర్ వేడుకలు


పూర్వీకుల సమాధుల వద్ద ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

పీలేరు, మార్చి 31: ఏసుక్రీస్తు పునరుత్థానం పొందిన ఈస్టర్ వేడుకలను పీలేరు మండలంలోని క్రైస్తవులు ఆదివారం ఆనందోత్సాహాలతో ఘనంగా జరుపుకున్నారు. ఒకరికొకరు ఈస్టర్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రపంచానికి శాంతి, ప్రేమను బోధించిన ఏసుక్రీస్తును అన్యాయంగా శిలువ వేయడాన్ని గుడ్ ఫ్రైడేగా శుక్రవారం బాధాతప్త హృదయాలతో జరుపుకున్న క్రైస్తవులు ఆయన సమాధిలో నుంచి మూడు రోజుల తరువాత పునరుత్థానం పొందిన ఈస్టర్‌ను ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలు, ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఈస్టర్ సండే సందర్భంగా పట్టణంలోని అధిక శాతం క్రైస్తవులు ఆదివారం వేకువజామున పూర్వీకుల సమాధుల వద్దకు చేరుకుని వారి ఆత్మ శాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. అనంతరం తమ సమీప ప్రాంతాల్లోని చర్చిలు, ప్రార్థనా మందిరాలకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈస్టర్ సందర్భంగా పట్టణంతోపాటు మండలంలోని ప్రతి గ్రామంలో ఉన్న ప్రార్థనా మందిరాలు కిటకిటలాడాయి. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో పాస్టర్లు సుందర్ రావు, డేనియల్, శామ్యూల్, జార్జి, ఆయా చర్చుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్రీస్తుబోధనలే సదాచరణకు గీటురాళ్లు


సియోను ప్రార్థనా మందిరంలో ధార్మికోపన్యాసం చేస్తున్న పాస్టర్ ప్రకాశం

కురబలకోట, మార్చి 31: క్రీస్తుబోధనలే సదాచరణకు గీటురాళ్లు అని పాస్టర్ ప్రకాశం పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని అంగళ్లు సియోను ప్రార్థనా మందిరం, తెట్టు, కామూరివాండ్లపల్లె, ఆరోగ్యపురం తదితర చోట్ల చర్చిలలో ఈస్టర్‌డే పండుగ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మనిషి తన దైనందిత జీవితంలో పరోపకారమే పరమావధిగా జీవితాన్ని కొనసాగించి తోటి వారికి సాయపడాలన్నారు. ప్రతి ఒక్కరు సన్మార్గంలో పయనించాలన్నారు. అనంతరం ప్రపంచ శాంతి కోసం ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా చర్చిలను విద్యుత్‌దీపాలతో ప్రత్యేకంగా అలంకరించి ముస్తాబు చేశారు.

అంతర్జాతీయ సదస్సులో మిట్స్ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సి.యువరాజ్

కురబలకోట, మార్చి 31: మండలంలోని అంగళ్ళు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు అంతర్జాతీయ సదస్సులో ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ సి.యువరాజ్ తెలిపారు. కళాశాలలో సీఎస్ఈ ఫైనలియర్‌కు చెందిన విద్యార్థులు చెన్నైలోని పనిమలర్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన అంతర్జాతీయ సదస్సులో నితిన్, మోహన్, శ్యాంప్రసాద్, దీక్షిత, సింధులు తమ పరిశోధనను ప్రద ర్శించగా బెస్ట్ పేపర్ అవార్డును సాధించారు. వారికి ప్రశంసా పత్రాలను, మెమెంటోలను అందజేశారు. ప్రతిభ కనబరిచిన విద్యా ర్థులను కరస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి, ప్రిన్సిపాల్ యువరాజ్, విభాగాధిపతి కల్పన అభినందించారు.

ఆరోగ్యానికి నడక ఎంతో ప్రయోజనకరం

రాజంపేటటౌన్,మార్చి 31: ప్రతి రోజూ ప్రతి వ్యక్తి దినచర్యలో భాగంగా నడక నిర్వహిస్తే ఆరోగ్యం తమ సొంతమవుతుందని వాకర్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కొండూరు శరత్‌కుమార్‌రాజు పేర్కొన్నారు. ఆదివారం రాజంపేట మండల పరిధిలోని శాస్త్రి ఇంటర్నేషనల్ హైస్కూల్‌లో వాకర్స్ ఇంటర్నేషనల్ 157 కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు మురళీమోహన్‌రావు, సెక్రటరీ ప్రదీప్‌కుమార్, ట్రెజరర్ ఎస్ఎం అక్బర్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శారీరక, మానసిక ధృడత్వానికి నడక ఎంతో ఉపయోగపడుతుందని వారు తెలిపారు. అనంతరం వాకర్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కొండూరు శరత్‌కుమార్‌రాజును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, వాకర్స్, పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కనుమలో గంగమ్మ తిరుణాల


అలంకరణలో కనుమలోగంగమ్మ

మదనపల్లె అర్బన్, మార్చి 31: మదనపల్లె మండలం, బసినికొండ పంచాయతీ పుంగనూరు రోడ్డులోని కనుమలో గంగమ్మ పగలు తిరుణాల ఆదివారం వైభవంగా జరిగింది. మదనపల్లె మండలంలోని బసినికొండ, రామాచార్లపల్లె, వలసపల్లె, డ్రైవర్స్ కాలనీ, వడ్డిపల్లె, మొలకలదిన్నె చెందిన మహిళలు దీలు,బోనాలు భక్తిశ్రద్ధలతో ఊరేగింపుగా తరలివచ్చి గంగమ్మకు సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. శనివారం రాత్రి భక్తులు చాందినీ బండ్లతో ఆలయానికి తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆదివారం సాయంత్రం ఆలయంలో ఏర్పాటు చేసిన ఉట్లతిరుణాలలో యువత ఆసక్తిగా పాల్గొన్నారు. కార్యక్రమాలను ఆలయ ఈవో రమణ, ఆలయకమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ముగిసిన దండుమారెమ్మ జాతర


అమ్మవారు

కురబలకోట, మార్చి 31: మండలంలోని ముదివేడులో వెలసిన దండుమారెమ్మ జాతర ఆదివారం ముగిసింది. పడమటి ప్రాంత మండలాల్లో ప్రసిద్ధి చెందిన ఈ జాతరను రెండు రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించారు. జాతరకు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనడంతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. విద్యుత్ దీపాలతో ఆలయాన్ని అలంరించడంతో పాటు చాందినీబండ్లను ఊరేగించారు. రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు పి.సురేంద్రయాదవ్, మండల కన్వీనర్ వైజీ సురేంద్రయాదవ్, రాజంపేట తెలుగు యువత ప్రధానకార్యదర్శి అయూబ్ బాషా, మాజీ సర్పంచ్ వైజీ రమణ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు చేపట్టారు. అలాగే జాతరలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముదివేడు పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కామేశ్వరుడిని తాకిన సూర్య కిరణాలు



వాల్మీకిపురం, మార్చి 31: వాల్మీకిపురం పట్టణంలోని కోనేటివీధిలో వెలసిన లక్ష్మీకామేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం సూర్య కిరణాలు స్వామివారిని స్పృశించాయి. ఉదయం ఆలయం లోని కామేశ్వరస్వామి శివలింగంపై సూర్య కిరణాలు అలంకార రీతిలో దర్శనమివ్వడంతో భక్తులు ఈ దృశ్యా లను దర్శించి తరించారు.

రెడ్డెమ్మతల్లికి ప్రత్యేక పూజలు

గుర్రంకొండ, మార్చి 31:గుర్రంకొండ మండలం చెర్లోపల్లెలో కొలువైన రెడ్డెమ్మకొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయంలో అమ్మవారు సంతానలక్ష్మీగా ప్రసిద్ధి చెందారు. ఇందులో భాగంగా ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పరిమళభరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి అర్చకులు పూజలను చేశారు. అమ్మవారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి మహిళా భక్తులు వచ్చారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు మొక్కులు తీర్చుకోవడానికి ఆలయానికి రావడంతో ఆలయ పరిసరాలు భక్తులతో రద్దీగా మారాయి. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

● జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి

బి. కొత్తకోట,మార్చి31: జిల్లాలో ఎక్కడ తాగునీటి సమస్య తలెత్తినా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటామని జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి పేర్కొన్నారు. ఆదివారం బి. కొత్తకోట మండలంలోని తుమ్మనంగుట్ట పంచాయతీలో ఆమె పర్యటించారు. పంచాయతీ పరిధిలోని సుంకరవారిపల్లెలో ప్రభుత్వ తాగునీటి పథకానికి చెందిన బోర్లు అడుగంటి పోవడంతో గ్రామంలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొందని డీపీవో దృష్టికి వచ్చింది. దీంతో ఆమె సుంకరవారిపల్లెకు చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. తక్షణం ట్యాంకర్‌ను ఏర్పాటు చేసి గ్రామంలోకి నీటిని తరలించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దినేష్‌ను ఆదేశించారు. మండలంలో ఎక్కడ సమస్య తలెత్తినా వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, ప్రజలు నిరసనలు, ధర్నాలు చేసే పరిస్థితి రాకుండా చూడాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి ఈశ్వర్‌రెడ్డి ఉన్నారు.

వచ్చే ఎన్నికల్లో వైసీపీ ఓటమి ఖాయం: బీజేపీ

రైల్వేకోడూరు, మార్చి 31: వచ్చే ఎన్నికల్లో వైసీపీ ఓటమి ఖాయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పనతల సురేష్ తెలిపారు. ఆదివారం బీజేపీ కార్యాయలంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైల్వేకోడూరు నియోజకవర్గంలో బీజేపీ, టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి గెలుపు ఖాయమన్నారు. రైల్వేకోడూరు ఎమ్మెల్యే నాలుగు సార్లు గెలిచి అభివృద్ధిని మరిచాడని ఆరోపించారు. మంగంపేట ప్రముఖ పారిశ్రామికవేత్త పులపుత్తూరు రామసుబ్బారెడ్డి బీజేపీలో చేరడంతో మరింత బలం ఏర్పడిందన్నారు. ఎన్నికలు సమీపిస్తున్నడడంతో నియోజకవర్గంలో భూమి పూజలు, శంఖుస్థాపనలు చేశారన్నారు. నిధులు లేకుండా పనులు ఎలా చేస్తారని ప్రశ్నించారు. నాలుగు సార్లు గెలిచిన ఎమ్మెల్యే ఆస్తులు పెంచుకున్నాడని తెలిపారు. రైల్వేకోడూరు అసెంబ్లీ ఇన్‌ఛార్జ్ గడ్డం చంగల్‌రాజు మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అక్రమ వ్యాపారాలు, దోపిడీలు, ఎర్రచందనం స్మగ్లింగ్, దాడులు తదితరవి పెరిగిపోయాయని తెలిపారు. జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు దాసరాజు జయప్రకాష్‌నారాయణవర్మ మాట్లాడుతూ వైసీపీ రైతులకు ఏమి చేయలేదని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ సీనియర్ నాయకులు తోట శ్రీనివాసులు, వాకచర్ల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

క్లస్టర్ ఇన్‌చార్జులు బాధ్యతగా వ్యవహరించాలి

● టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి షాజహాన్‌బాషా


కాకరకాయలపల్లెలో మాట్లాడుతున్న టీడీపీ అభ్యర్థి షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, మార్చి 31: మదనపల్లె నియోజకవర్గంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జులు బాధ్యతగా వ్యవహరించాలని టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి షాజహాన్‌బాషా పేర్కొన్నారు. ఆదివారం సుబాష్‌రోడ్డులోని ఆయన నివాసం వద్ద పట్టణ క్లస్టర్, బూత్ ఇన్‌చార్జులతో సమావేశం నిర్వహించారు. పట్టణంలో 35 వార్డులు, నియోజ కవర్గంలో 55 గ్రామ పంచాయతీలకు గాను 10 మందికి పైగా క్లస్టర్ ఇన్‌చార్జులు ఇది వరకు పనిచేశారన్నారు. వారిలో కొంత మంది తాము నిర్వహించే సమావేశాలకు రాలేకపోతున్నారని, సోమవారం నిర్వహించే సమావేశానికి వారు రాకుంటే వారి స్థానంలో వేరొకరిని నియమిస్తామన్నారు. వ్యక్తిగత కారణాలు పక్కన పెట్టి టీడీపీ గెలుపునకు కృషి చేయాలన్నారు. అనంతరం కమ్మవీధికి చెందిన తెలుగు యువత అధ్యక్షుడు బోయపాటి రాణా ఆధ్వర్యంలో యువత షాజహాన్ బాషాను మర్యాదపూర్వకంగా కలసి మద్దతు తెలిపారు.

వైసీపీ పాలనలో అవినీతికి అంతేలేకుండా పోయింది

ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామ స్థాయి నుంచి అవినీతికి అంతులేకుండా పోయిందని టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి అభ్యర్థి షాజహాన్‌బాషా పేర్కొన్నారు. మండలంలోని వలసపల్లె పంచాయతీ కాకరకాయలపల్లెలో మాజీ సర్పంచ్ చంద్రశేఖర్‌నాయుడు ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల్లో ఏపని కావాలన్నా డబ్బులు ఇచ్చే దౌర్భాగ్య పరిస్థితి వైసీపీ పాలనలో జరిగిందన్నారు. తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు, జనసేన నేత శ్రీరామ రామాంజనేయులు మాట్లాడుతూ విజనరీ లీడర్ చంద్రబాబు సీఎం అయితేనే ప్రజలకు సుభిక్ష పాలన వస్తుందన్నారు. షాజహాన్‌బాషాను గెలిపించి, చంద్రబాబును సీఎం చేయాల్సిన బాధ్యత మనందరిపై వుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు విజయ్‌కుమార్, స్టోర్ రమణ, మల్లికార్జున, మురళి, నరసప్ప, తిరుమలప్ప పాల్గొన్నారు.

మాజీ సీఎం కిరణ్‌ను కలిసిన జనసేన నేతలు


మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డిని కలిసిన జనసేన నేతలు

ములకలచెరువు, మార్చి 31: మాజీ సీఎం, రాజంపేట పార్లమెంటు ఉమ్మడి ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని ఆదివారం జనసేన నేతలు కలిశారు. కలికిరి మండలం నగిరిపల్లెలో ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్, తంబళ్లపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జి పోతుల సాయినాథ్‌లు మాజీ సీఎంను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అలాగే పీలేరు ఉమ్మడి అభ్యర్థి కిశోర్‌కుమార్‌రెడ్డిని కలిశారు. ఈ కార్యక్ర మంలో నాయకులు లక్ష్మణ్, అనీల్, రాజు, రెడ్డిశేఖర్, బావాజీ, పవన్‌రెడ్డి, మహేష్, కోటప్ప తదితరులు పాల్గొన్నారు.

గంగాద్రినాయుడు సేవలు ఆదర్శనీయం


సన్మాన గ్రహీతకు శుభాకాంక్షలు తెలుపుతున్న నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి

కలకడ, మార్చి 31:ఉపాధ్యాయు డిగా గంగాద్రినాయుడు సేవలు ఆదర్శనీయమని పలువురు వక్తలు కొనియాడారు. బాటవారిపల్లె జడ్పీ హైస్కూల్‌లో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ఆదివారం పదవీ విరమణ చేసిన గంగాద్రినాయుడును ప్రముఖులు పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ మండలంలోని వివిధ పాఠశాల్లో పని చేసిన ఆయన విద్యాభివృద్ధికి విశేష కృషి చేసినట్లు తెలిపారు. విధులను అంకితాభావంతో నిర్వహించి ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దిన ఘనత దక్కించుకున్నారని గుర్తు చేశారు. అలాగే సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ ముందుండి నడిపించడం గర్వకారణమన్నారు. కాగా పీలేరు టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి సన్మాన గ్రహీతకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మానవత సేవ సంస్థ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రారెడ్డి, ఆదినారాయణరెడ్డి, దగ్గుబాటి వెంకటేశ్వరరావు, సరస్వతమ్మ, శ్రీనివాసులరెడ్డి, భాస్కర్, అరవ వేణుగోపాల్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, వైవిరమణ, శ్రీనివాసరావు, సదాశివ రెడ్డి, ప్రభాకర్, దేవాంజులు, బాబురెడ్డి, ఆంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమ జిల్లాల వాల్మీకులకు ఇచ్చిన హామీ ఏది?


మాట్లాడుతున్న వీఆర్ఎస్ఎస్ రాష్ట్రఅధ్యక్షుడు పొదల నరసింహులు

మదనపల్లె అర్బన్, మార్చి 31: రాయలసీమ జిల్లాల వాల్మీకి బోయలకు ఇచ్చిన ఎస్టీ రిజర్వేషన్ హామీ ఏమైందో చెప్పాలని సీఎం జగన్‌ను ఏపీ వాల్మీకి రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు పొదల నరసింహులు డిమాండ్ చేశారు. ఆదివారం మదనపల్లెలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీలో తీర్మానం చేసిన వాల్మీకిబోయల గిరిజన రిజర్వేషన్ సిఫార్సు శ్వేతపత్రం విడుదలచేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రస్తుతం మేమంతా సిద్ధం అంటూ చేపట్టిన బస్సుయాత్ర వాల్మీకులున్న ప్రాంతాల్లో పర్యటించవద్దని హెచ్చరించారు. వాల్మీకులకు మాట ఇచ్చి మోసం చేసిన సీఎం జగన్‌కు ఓట్లు అడిగే నైతిక హక్కు కోల్పోయారన్నారు. జగన్ కుట్రలు, కుతంత్రాలు వాల్మీకిబోయల వద్ద చెల్లవని, మదనపల్లె పర్యటనకు వాల్మీకి బోయలు ఎవ్వరూ హాజరు కావద్దని గ్రామస్థాయిలో చైతన్యం కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి మేకల విజయ్‌మోహన్, జిల్లా సెక్రటరీ మారకృష్ణమూర్తి, పట్టణ అధ్య క్షుడు కొత్తఉడుము శంకర, జిల్లా కార్యవర్గనాయకుడు చెన్నం శ్రీరాములు పాల్గొన్నారు.

ఇఫ్తారు విందులో పాల్గొన్న టీడీపీ నేత కొండా నరేంద్ర


ఇఫ్తార్ విందులో కొండానరేంద్ర

తంబళ్లపల్లె, మార్చి 31: తంబళ్లపల్లెలో ముస్లింలు ఆదివారం ఏర్పాటు చేసిన ఇఫ్తారు విందులో టీడీపీ నియోజకవర్గ నేత కొండా నరేంద్ర పాల్గొన్నారు. తొలుత జూనియర్ కళాశాల నుంచి ర్యాలీగా వెళ్లి పాత మసీదులో ముస్లింలతో కలసి ప్రత్యేక పార్థనలు చేసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. అనంతరం పలువురు టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు మద్దతుదారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కొండా నరేంద్ర మాట్లాడుతూ..తంబళ్లపల్లె గత ఐదేళ్లల్లో ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదని విమర్శించారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న తంబళ్లపల్లెకు చెందిన టైలర్ బాషాను స్వగృహానికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10వేలు ఆర్థిక సహాయం అందచేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొశెట్టి వెంకట్రమణ, టైలర్ మునాఫ్, రెడ్డప్ప, జనసేన నాయకులు ఎద్దుల నరసింహులు, మురళి, సురేష్, రాజారెడ్డి, మనోహర్ టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు ఘనసన్మానం


పదవీ విరమణ చేసిన ఉద్యోగులను సన్మానిస్తున్న అధికారులు, కార్మికులు

పీలేరు, మార్చి 31: పీలేరు ఆర్టీసీ డిపోలో ఆదివారం పదవీ విరమణ చేసిన పలువురు ఉద్యోగులను అధికారులు, కార్మిక సంఘ నాయకులు ఘనంగా సన్మానించారు. పీలేరు డిపోలో కండక్టర్లుగా పని చేస్తున్న డి.సైదుల్లా, ఎస్.నజీర్, డ్రైవర్లుగా పనిచేస్తున్న రాజేంద్ర, ఎస్.వాసు, మెకానిక్ ఎస్వీ రమణ ఆదివా రం పదవీ విరమణ చేశారు. వారికి డిపో మేనేజర్ బండ్ల కుమార్ నేతృత్వంలో స్థానిక డిపో కార్యాలయం వద్ద కార్మిక సంఘ నాయకులు ఘనంగా సన్మానించారు.

నవోదయ ప్రవేశ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ

మదనపల్లె అర్బన్, మార్చి31: నవోదయ ప్రవేశ పరీక్షల్లో మదనపల్లె పట్టణం సొసైటీ కాలనీలోని మల్లికార్జున కోచింగ్ సెంటర్ నుంచి ముగ్గురు విద్యార్థులు నవోదయకు ఎంపికైనట్లు కోచింగ్ సెంటర్ డైరెక్టర్ మల్లికార్జున ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25 ఏడాదికి ముగ్గురు నవోదయకు, ఆరుగురు సైనిక్‌కు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. బి.అఖిలేష్ ,సి.చేతన్ , ఎం.ఉమేష్‌లు నవోదయకు ఎంపికయ్యారు. నవోదయ కోచింగ్ ఏప్రిల్ 1వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు. పేదవిద్యార్థులకు నవోదయలో సీటు దక్కడం వరంలాంటిదని డైరెక్టర్ మల్లికార్జున తెలిపారు.